నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దిన పత్రిక
RNI - TELTEL/2023/87644

సంచిక : 212 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | గురువారం | 13-11-2025 పేజీలు -8 | వెల: రూ. 5.00


**నీలగిరి నిత్యపద్యం**
ఆటవెలది

విశ్వవ్యాప్తముగను విజ్ఞానులందరూ
(నాటుపాట)ను విని మేటియనిరి
కోట్ల జనుల హృదిని కొల్లగొట్టిన పాట
(స్వర్ణగోల)గెలిచె స్వరమునందు

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి


**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.




# ఢిల్లీ చేరుకున్న ప్రధాని మోడీ

- ఆస్పత్రిలో క్షతగాత్రులకు పరామర్శ

న్యూఢిల్లీ,
ఢిల్లీ పేలుడు ఘటనలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బుధవారంనాడు పరామర్శించారు. రెండ్రోజుల భూటాన్ పర్యటన ముగించుకుని వచ్చిన ప్రధాని ఆ వెంటనే లోక్‌నాయక్ జయప్రకాష్ ఆసుపత్రికి వెళ్లారు. బాధితులతో నేరుగా మాట్లాడి త్వరగా కోలుకోవాలని అభిలషించారు. వైద్యులు, అధికారులతో మాట్లాడారు. బాధితుల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రధాని రాక కోసం ఆసుపత్రి

-మిగతా 2 లో




# కేబినేట్ పై ఆశలేదు

నాకు సీఎంకు ఎలాంటి గ్యాప్ లేదు'.

- మా ఇద్దరి మధ్య సయోధ్య ఉంది
- మంత్రి పదవి కోసం తానెప్పడు అడగలేదు
- పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ స్పష్టీకరణ

హైదరాబాద్,నవంబర్ 12 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్ )
సీఎం రేవంత్ రెడ్డి, తనకు మధ్య ఎలాంటి గ్యాప్ లేదని టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ స్పష్టతనిచ్చారు. తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా తాను చాలా సంతోషంగా ఉన్నానని, మంత్రి పదవి కావాలని తాను ఎక్కడ అడగడం లేదని కూడా ఆయన వివరణ ఇచ్చారు. ' పార్టీ లో నేను ఆర్గనైజషన్ నుంచి వచ్చాను. పార్టీ అప్పగించే బాధ్యతను నిర్వర్తిస్తాను. నేను మంత్రి వర్గంలోకి వెళ్లాలని ఆరాటపడటం లేదు. -మిగతా 2 లో



# ఢిల్లీ పేలుళ్లు ఉగ్రదాడే

- తీవ్రంగా ఖండించిన కేంద్రకేబినేట్
- మృతులకు మంత్రివర్గం సంతాపం
- ఉగ్రవాదంపై పోరు కొనసాగుతుందని ప్రకటన

న్యూఢిల్లీ
దిల్లీ పేలుడు ఘటనను ఖండించిన కేంద్ర కేబినెట్.. ఇది కిరాతక ఉగ్ర ఘాతుకంగా పేర్కొంది. ఉగ్రవాదంపై పోరు కొనసాగించాలని నిర్ణయించింది. ఈ ఘటనకు కారకులైన వారిని చట్టం ముందు నిలబెడతామని ఉద్ఘాటించింది. ఇందుకు సంబంధించిన తీర్మానాన్ని కేంద్ర కేబినెట్ ఆమోదించినట్లు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. దిల్లీ కారు పేలుడు ఘటన నేపథ్యంలో ప్రధాని మోదీ నేతృత్వంలో కేంద్ర కేబినెట్ ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించింది. దర్యాప్తు కొనసాగుతున్న తీరు, భద్రతా చర్యలు, ఆయా సంస్థల మధ్య సమన్వయంపై దృష్టి సారించినట్లు సమాచారం. ఈ సందర్భంగా ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపంగా రెండు నిమిషాల పాటు కేంద్ర కేబినెట్ మౌనం పాటించింది. ప్రధాని నివాసంలో జరిగిన ఈ సమీక్షా సమావేశంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్, తదితరులు పాల్గొన్నారు. ఎగుమతి ప్రోత్సాహక మిషన్‌కు

-మిగతా 2 లో



# బంగ్లాలో శాంతియుత వాతావరణం రావాలి

- స్వేచ్ఛాయుత, న్యాయమైన ఎన్నికలు జరగాలి
- అప్పడే స్వదేశానికి వచ్చే విషయం ఆలోచిస్తా
- మాజీప్రధాని షేక్ హసీనా వెల్లడి

న్యూఢిల్లీ
: ప్రస్తుతం బంగ్లాలో అధికారంలో ఉన్న యూనస్ నేతత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం తీవ్రవాద శక్తులకు అధికారం ఇస్తూ.. భారత్‌తో ఆ దేశ సంబంధాలను ప్రమాదంలో పడేస్తోందని ఆ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనా ఆరోపించారు. బంగ్లాదేశ్‌లో తలెత్తిన ఉద్రిక్తతల కారణంగా ఆ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనా భారత్‌కు వచ్చి ఆశ్రయం పొందుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఆమె తిరిగి తన స్వదేశానికి వెళ్లే విషయంలో అక్కడి ప్రభుత్వానికి కొన్ని షరతులు పెట్టారు. స్వేచ్ఛాయుతమైన, న్యాయమైన ఎన్నికలను నిర్వహించినప్పడే తాను తిరిగి బంగ్లాదేశ్‌కు వస్తానని ఆమె స్పష్టం చేశారు. అలాగే బంగ్లాలో అవామీ లీగ్ పార్టీ పై నిషేధం ఎత్తివేయాలని ఆమె డిమాండ్ చేశారు. స్వేచ్ఛాయుతమైన ఎన్నికలు నిర్వహించాలని అక్కడి ప్రజలు కూడా కోరుకుంటున్నారని ఆమె తాజాగా పీటీఐకి ఇచ్చిన ఈమెయిల్ ఇంటర్వ్యూలో చెప్పారు. మ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో భారత్‌తో బలమైన సంబంధాలు

-మిగతా 2 లో

# బీఆర్ఎస్ కేటీఆర్ ఖేల్ ఖతం

- జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ భారీ విజయం ఖాయం అన్న వివేక్
- 25 నుంచి 30వేల మెజార్టీతో గెలుస్తున్నాం



మంచిర్యాల, నవంబర్ 12 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్ )
జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ 25 నుంచి 30 వేల ఓట్ల మెజార్టీతో గెలవబోతున్నారని.. ఈ ఎన్నికలో హస్తం పార్టీ విజయంతో కేటీఆర్ పని ఖతం కానుందని కార్మిక, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలకు ప్రజలు అండగా నిలిచారని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల -మిగతా 2 లో

## వరుస రోడ్డు ప్రమాదాలపై

# అప్రమత్తం

- రాష్ట్రవ్యాప్తంగా 33 ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్స్
- రాష్ట్ర స్థాయిలో 3 ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు
- రవాణాశాఖ ఉన్నతాధికారులతో మంత్రి పొన్నం సమీక్ష



హైదరాబాద్,
వరుస రోడ్డు ప్రమాదాల నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా జిల్లా స్థాయిలో 33 ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్స్, రాష్ట్ర స్థాయిలో 3 ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లో రవాణాశాఖ ఉన్నతాధికారుల తో మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రవాణా శాఖలో ఎన్‌ఫోర్స్‌మెంట్ నిఘా నిరంతరం ఉండేలా ఎలాన్ ఆఫ్ యాక్షన్ చేపడుతున్నట్లు వివరించారు. -మిగతా 2 లో

# బీఆర్ఎస్, కాంగ్రెస్ దొందూదొందే



## ఇరు పార్టీల పాలనలో నల్లగొండకు అన్యాయం

- కృష్ణాజలాలు అందించడంలో రెండు ప్రభుత్వాలు విఫలం
- ఆస్పత్రిలో కనీస వసతులు కల్పించలేక పోయారు
- జాగృతిజనం బాటలో కవిత ఘాటు విమర్శలు

నల్లగొండ, నవంబర్ 12 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్ )
తెలంగాణ వచ్చాక కూడా నల్లగొండ జిల్లాకు కృష్ణా జలాలు అందలేదని నల్లగొండ జిల్లా కేంద్రంలో కల్వకుంట్ల కవిత మీడియాతో మాట్లాడుతూ అన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు నల్లగొండ జిల్లాకు సాగునీరు అందించడంలో విఫలం అయ్యాయి. ప్రభుత్వాలను అడిగేందుకు, నిలదీసేందుకే జాగృతి జనం బాట చేపట్టామని అన్నారు. జాగృతి జనం బాట'లో భాగంగా నల్లగొండ జిల్లాలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా నల్గొండ జిల్లా కేంద్రంలో తన ఫ్లెక్సీలను తొలగించడంపై స్పందించారు. ఫ్లెక్సీలు తొలగించడానికి కవిత తప్పు పట్టారు. కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి -మిగతా 2 లో

# 26/11 ముంబయి దాడుల తరహాల పేలుళ్లకు కుట్ర

- భారీగా పేలుడు పదార్థాలు సిద్ధం చేస్తున్న ఉగ్రవాదులు
- ఢిల్లీ ఎర్రకోట పేలుడుతో తవ్వుతున్నకొద్దీ పలు విషయాలు వెల్లడి



2 లో

# మేడారంలో మంత్రుల పర్యటన

- పదికోట్ల మంది భక్తులు వచ్చినా దర్శనానికి ఇబ్బందులు రాదు
- దీక్షతో, బాధ్యతతో జాతరనాటికి పనులు పూర్తి చేస్తాం
- పనులను పర్యవేక్షించిన మంత్రులు
- భక్తులకు ఇబ్బంది లేకుండా సకాలంలో పూర్తికి చర్యలు



ములుగు,నవంబర్ 12 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్ )
మేడారంలో భక్తులకు అసౌకర్యం కలుగకుండా నిర్మాణ పనులు జరుగుతున్నాయని.. అనుకున్న సమయానికి పనులు పూర్తి చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. పదికోట్ల మంది భక్తులు వచ్చినా దర్శనానికి ఇబ్బందులు లేకుండా పనులు చేస్తున్నామని తెలిపారు. మేడారంలో తెలంగాణ మంత్రులు పర్యటించారు. బుధవారం మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి,

-మిగతా 2 లో

# అమెరికాలో ప్రతిభావంతులు లేరు..

## విదేశీ ప్రతిభ అవసరమే : డొనాల్డ్ ట్రంప్



- అమెరికాకు చెందిన ఉద్యోగులు బయట నుంచి వచ్చే వారి దగ్గర నైపుణ్యాలు నేర్చుకోవాలి
- శ్రామిక శక్తి కొరతను తీర్చేందుకు విదేశీ ప్రతిభ అవసంరం

న్యూఢిల్లీ
హెచ్-1బీ వీసాల విషయంలో కఠిన వైఖరి ప్రదర్శిస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ .. తాజాగా తన స్వరం మార్చారు. విదేశీ ఉద్యోగుల నియామకాన్ని ఆపాలంటూ టెక్ సంస్థలను ఆదేశించిన విషయం తెలిసిందే. అయితే, ఇప్పుడు మాత్రం తన వైఖరి మార్చారు. అమెరికాకు విదేశీ ప్రతిభ ( అవసరమేనని స్పష్టం చేశారు. ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో అమెరికా అధ్యక్షుడు మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.ఇంటర్వ్యూలో భాగంగా విలేకరు 'మన దగ్గర చాలా మంది ప్రతిభావంతులైన కార్మికులు ఉన్నారు' అని అనగా.. అందుకు ట్రంప్ 'లేదు, మన దగ్గర లేదు' అంటూ బదులిచ్చారు. 'మనదగ్గర అంత ప్రతిభగల వ్యక్తులు లేరు. బయటి నుంచి వచ్చే వారి దగ్గర నుంచి ప్రజలు నైపుణ్యాలను నేర్చుకోవాలి' అని వ్యాఖ్యానించారు.

-మిగతా 2 లో

# తమది పేదల ప్రభుత్వం




- పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్నాం
- దేవగుడిపల్లిలో గృహప్రవేశాల కార్యక్రమంలో చంద్రబాబు
- జగన్ హయాంలో అంతా విధ్వంసమేనని విమర్శలు

అన్నమయ్య,
తమది పేదల ప్రభుత్వమని.. వారికి న్యాయం చేసేందుకు పనిచేస్తామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్నామని అన్నారు. చిన్నమండెం మండలం దేవగుడిపల్లిలో గృహప్రవేశాల కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. మూడు లక్షల గృహాలను వర్చువల్‌గా -మిగతా 2 లో

# ఢిల్లీ చేరుకున్న ప్రధాని మోడీ

మొదటి తరువాయి

ప్రధాన ద్వారం వద్ద మీడియా వేచి ఉండటంతో ఆయన ఆసుపత్రిలో వెనుక వైపునున్న ప్రత్యేక గేటు ద్వారా లోపలకు వెళ్లారు. ఢిల్లీలో పేలుడుకు బాధ్యులైన వారిని విడిచిపెట్టే ప్రసక్తే లేదని, వారిని చట్టం ముందు ఉంచుతామని పేలుడు ఘటన అనంతరం మోదీ స్పష్టం చేశారు. ఢిల్లీ పేలుడు దుర్ఘటనలో 12 మంది ప్రాణాలు కోల్పోగా, 20 మందికి పైగా గాయపడ్డారు. ఈ ఘటనపై ఎన్ఐఏ దర్యాప్తు చేపట్టింది. ఈ క్రమంలో ఆసపత్రికి చేరుకున్న వెంటనే చికిత్స పొందుతున్న వారిని నేరుగా పరామర్శించారు. వారికి ధైర్యం చెప్పారు.

# ఢిల్లీ పేలుళ్లు ఉగ్రదాడే

మొదటి తరువాయి

కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన కేబినెట్ భేటీలో దీనికి ఆమోద ముద్ర వేసింది. దీని ద్వారా ఆరేళ్లపాటు రూ.25,060 కోట్లు కేటాయించనున్నారు. ఎగుమతుల ఎకో సిస్టమ్ బలోపేతానికే ఈ మిషన్‌ను తీసుకొచ్చారు. ఎగుమతిదారుల కోసం క్రెడిట్ గ్యారంటీ పథకం విస్తరణకు కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది.

# కేబినెట్ పై ఆశలేదు

మొదటి తరువాయి

నాకు సీఎంతో పాటు మంత్రివర్గం మొత్తం పూర్తిగా సహకారం అందిస్తున్నారు. నాకు, సీఎంకు ఎలాంటి గ్యాప్ లేదు'. అని మహేష్ గౌడ్ చెప్పారు. తెలంగాణలో కూడా ఓటు చోరీ జరిగిందన్న మహేష్ గౌడ్.. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఓటు చోరీ చేసి ఎక్కువ సీట్లు గెలిచిందన్నారు. నిజామాబాద్‌లో ఓటు చోరీ చేసినట్లు ఆధారాలు ఉన్నాయని చెప్పుకొచ్చారు. ఓల్డ్ సిటీలో ఆధారాలను ఫిరోజ్ ఖాన్ బయట పెట్టాడని, ఖైరతాబాద్‌లో ఉప ఎన్నిక వస్తుందనుకోవడం లేదని కూడా టీపీసీసీ చీఫ్ చెప్పారు. ఫిరాయింపుల వ్యవహారం స్పీకర్ పరిధిలో ఉంది. దానం నాగేందర్ మా పార్టీ విధానాలు నచ్చి మాతో ప్రయాణిస్తున్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కెసిఆర్ ఎందుకు ప్రచారం చేయలేదో ఆ పార్టీ నేతలే చెప్పాలి. ఇంపొంట్ వ్యక్తులకు కెసిఆర్ ఫోన్ లు చేసినట్లు మాకు సమాచారం ఉంది. ఢిల్లీలో బాంబ్ బ్లాస్ట్ జరగడం దురదృష్టకరం. ఢిల్లీలో బాంబ్ బ్లాస్టింగ్, కేంద్ర ప్రభుత్వ నిఘా వైఫల్యమని ఆయన అన్నారు.

## బంగ్లాలో శాంతియుత వాతావరణం రావాలి

మొదటి తరువాయి

కొనసాగించామని, యూనస్ తన మూర్ఖత్వంతో వాటిని బలహీనపరుస్తున్నారన్నారని హసీనా విమర్శించారు. కష్ట సమయంలో ఆశ్రయం కల్పించినందుకు మోడీ ప్రభుత్వానికి, భారత ప్రజలకు ఈ సందర్భంగా ఆమె కతజ్ఞతలు తెలిపారు. తాను అధికారంలో ఉన్న సమయంలో విద్యార్థులు చేపట్టిన ఆందోళనలను పరిష్కరించడంలో తమ ప్రభుత్వం విఫలమైందని, అలాంటి భయంకరమైన ఘటనల నుంచి పాఠాలు నేర్చుకున్నానని పేర్కొన్నారు. సమయంలో విద్యార్థి నాయకులు కూడా బాధ్యత తీసుకొని ఉండాల్సిందని అభిప్రాయపడ్డారు. తనపై నమోదైన కేసుల విషయంలో అంతర్జాతీయ క్రిమినల్ కోర్టులో విచారణకు హాజరవడానికి తాను సిద్ధంగా ఉన్నానని షేక్ హసీనా తెలిపారు. యూనస్ ప్రభుత్వం తనపై చేసిన ఆరోపణలను హసీనా ఖండించారు. అవన్నీ రాజకీయంగా తనను బలహీనపరచడానికి చేసిన కుట్రగా పేర్కొన్నారు. విద్యార్థుల ఆందోళనలతో అనూహ్యరీతిన ప్రధాని పీఠం నుంచి దిగిపోయిన షేక్ హసీనా గతేడాది ఆగస్టు 5న బంగ్లాదేశ్‌ను వీడి భారత్‌కు వచ్చారు. నాటి నుంచి ఆమె ఢిల్లీలోని ఓ రహస్య ప్రదేశంలో నివసిస్తున్నారు.

# మేడారంలో మంత్రుల పర్యటన

మొదటి తరువాయి

కొండా సురేఖ, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ మేడారం చేరుకుని... అక్కడి పునర్నిర్మాణ పనులను పరిశీలించారు. ఆపై వనదేవతలను దర్శించుకున్నారు. అనంతరం మంత్రులు మీడియాతో మాట్లాడారు. ఆదివాసీల మనోభావాలను గౌరవిస్తూ పనులు చేస్తున్నామని... ఆదివాసీ పూజారుల ఆలోచనతోనే పనులు జరుగుతున్నాయని మంత్రి వెల్లడించారు. గతంలో మేడారంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని.. సీఎం రేవంత్ రెడ్డి వచ్చాక మేడారం అభివృద్ధి జరుగుతోందని మంత్రి కొండా సురేఖ అన్నారు. ఈ అభివృద్ధి చరిత్రలో నిలిచిపోతుందన్నారు. మేడారం జాతరను జాతీయ పండుగగా గుర్తించాలని.. దీనిపై కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ కలిసి ప్రధాన మంత్రిని నరేంద్ర మోడీని ఒప్పించాలని మంత్రి సీతక్క కోరారు. మేడారం మహాజాతర నాటికి పనులు పూర్తవుతాయని.. జాతర నాటికి పనులు పూర్తి చేస్తామని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. మేడారం అంటే తమ బంధం, భక్తి, భావోద్వేగం, బాధ్యత అని మంత్రి సీతక్క చెప్పుకొచ్చారు. మేడారంలో పది తరాలకు సరిపడ అభివృద్ధి చేస్తామన్నారు. దీక్షతో, బాధ్యతతో జాతరనాటికి పనులు పూర్తి చేస్తామని వెల్లడించారు. కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. దేవుడిపై రాజకీయాలు చేయొద్దని హితవుపలికారు. గతంలో వేసిన షెడ్లను తొలగించి పక్కకు పెట్టామన్నారు. మేడారంలో ఎలాంటి ప్రతిమలు లేకపోయినా కోట్లాది మంది భక్తులు తరలివస్తున్నారన్నారు. సమ్మక్క - సారలమ్మ ఆదివాసీల అస్థిత్వానికి సంకేతమని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

# అమెరికాలో ప్రతిభావంతులు లేరు..

మొదటి తరువాయి

అమెరికాలో అనుకున్న స్థాయిలో ప్రతిభావంతులు లేరని ట్రంప్ అంగీకరించారు. శ్రామిక శక్తి కొరతను తీర్చేందుకు విదేశీ ప్రతిభ అవసరమేనని నొక్కి చెప్పారు. దేశంలో పారిశ్రామిక, సాంకేతిక రంగాలను మరింత ముందుకు తీసుకువెళ్లాలంటే విదేశీ ప్రతిభను ఉపయోగించుకోవాల్సిందేనని స్పష్టం చేశారు. సరైన శిక్షణ లేకుండా తయారీ, రక్షణ రంగాల్లోని ముఖ్యమైన స్థానాల్లో నిరుద్యోగ అమెరికన్లను నియమించుకోలేమన్నారు. అమెరికాకు చెందిన ఉద్యోగులు బయట నుంచి వచ్చే వారి దగ్గర నైపుణ్యాలు నేర్చుకోవాలని ట్రంప్ సూచించారు.

# బీఆర్ఎస్ కేటీఆర్ ఖేల్ ఖతం

మొదటి తరువాయి

ఎన్నికలతో పాటు జీహెచ్ఎంసీ ఎలక్షన్స్‌లోనూ కాంగ్రెస్సే విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తంచేశారు. మంచిర్యాల జిల్లా భీమరం మండలం గొల్లవాగు ప్రాజెక్ట్ లో చేప పిల్లలను వదిలారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ 'రెండు నెలలుగా జూబ్లీహిల్స్ లో సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో ఇన్‌చార్జులుగా నేను, సహచర మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర రావుతో పాటు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నేతలు, డివిజన్లు, బూత్ లీడర్లు, కార్పొరేషన్ చైర్మన్లు చాలా శ్రమించాం. రెండు నెలల్లోనే కాంగ్రెస్ పార్టీని ఉన్నతమైన స్థాయికి తీసుకొచ్చాం. జూబ్లీహిల్స్ లోనూ మత్యకారులు కాంగ్రెక్ పార్టీకి మద్దతు ఇచ్చారు. నూరు శాతం రాయితీపై రిజర్వాయర్లు, చెరువులు, వాగులు, గుంటల్లో ఉచితంగా చేప పిల్లలు వేస్తున్నం. చెన్నూరులో మోడల్ ఫిష్ సెంటర్ ఏర్పాటు చేస్త. గొల్లవాగు ప్రాజెక్టును మా



నాన్న కేంద్ర మాజీ మంత్రి కాకా వెంకటస్వామి హయాంలో కట్టారు' అని వివేక్ గుర్తుచేశారు. 75 మార్కులు వచ్చిన విద్యార్థులకు తమ అంబేద్కర్ కాలేజీలో ఉచితంగా సీటు ఇస్తామని, ఇందుకు గానూ రూ. 80 లక్షల వరకు ఖర్చు చేసినట్లు మంత్రి వివేక్ తెలిపారు. విశాఖ ట్రస్ట్ నుంచి కూడా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. మంచిర్యాల జిల్లా జైపూర్ మండల కేంద్రంలో రూ. 2.5 కోట్లతో నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలిక జూనియర్ కాలేజీ నూతన భవనాన్ని కలెక్టర్ కుమార్ దీపక్?తో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా వివేక్ విద్యార్థులు మంచిగా చదువుకొని తల్లిదండ్రుల ఆశయాలను కొనసాగించాలి సూచించారు. రాష్ట్రంలో ప్రస్తుతం టీచర్ల కొరత లేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్? పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. తమ ప్రభుత్వం వచ్చాక 51 వేల ఉద్యోగాలను భర్తీ చేశామన్నారు. తాను చెన్నూరు నియోజకవర్గ అభివృద్ధిలో మొదటగా విద్యకే ప్రాధాన్యత ఇస్తానని చెప్పారు. ఎక్కడ సమస్యలున్నా తన దృష్టికి తీసుకొస్తే నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు.

# వరుస రోడ్డు ప్రమాదాలపై అప్రమత్తం

మొదటి తరువాయి

అందులోభాగంగా రోడ్డు ప్రమాదాలు నియంత్రించడానికి నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఓవర్ లోడింగ్ వాహనాలు సీజ్, పెనాల్టీతో పాటు ఆయా వాహనాలను స్వాధీనం చేసుకుంటామని వివరించారు. ప్రతి రోజు ఉదయం 6 గంటలకు ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలకు వివిధ ప్రాంతాల నుంచి సమాచారం అందుతుందని చెప్పారు. శాండ్, ల యాష్, స్టోన్, బిల్డింగ్ మెటీరియల్స్ తరలించే వాహనాలను ప్రత్యేకంగా తనిఖీలు చేపడతామన్నారు. అందుకోసం డీటీసీ, ఎంవీఐ, ఏఎంవీఐలతో కూడిన బృందాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అయితే ప్రయాణికులతో వెళ్తున్న ఆటోలు, వ్యవసాయ ట్రాక్టర్ల వారిని వేధించ వద్దని ఈ సందర్భంగా అధికారులకు మంత్రి పొన్నం కీలక



ఆదేశాలు జారీ చేశారు. ఫిట్‌నెస్ గడువు ముగిసిన వాహనాలు, ఓవర్ స్పీడ్ వాహనాలతోపాటు సీసీ బస్సులు సీజ్ చేయాలని స్పష్టం చేశారు. జేటీసీ, డీటీసీలు ప్రతి వారం రెండుసార్లు అంతర్రాష్ట్ర సీసీ బస్సులను తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. టిప్పర్లు, ట్రాలీలు టార్పాలిన్‌తో కప్పకుండా వస్తే చర్యలు తీసుకోవాలన్నారు. గత వారం చేవెళ్ల ప్రమాదం తర్వాత 2,576 వాహనాలపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. వాటిలో 352 లారీలు, 43 బస్సులు ఉన్నాయని వివరించారు. ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్లు వేగవంతం చేయాలని.. సిబ్బందికి శిక్షణ బాట్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మహిళలకు ఉపాధి అవకాశాల కోసం మహిళా ఆటోలకు అనుమతులు మంజూరు చేయాలని మంత్రులను ఆదేశించారు. రోడ్ సేఫ్టీ మంత్ సందర్భంగా అవగాహన కార్యక్రమాలు, వ్యాస రచన పోటీలు, చిల్డ్రన్ అవేర్‌నెస్ పార్క్‌ల వద్ద చేపట్టాలని అధికారులకు స్పష్టం చేశారు.

# బీఆర్ఎస్, కాంగ్రెస్ దొందూదొందే

మొదటి తరువాయి

పెద్ద మంత్రి అనుకున్నా అని విమర్శించారు. ప్రజా సమస్యలు ప్రస్తావిస్తే.. ప్లెక్సీలు తొలగిస్తారా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను తాను ప్రస్తావిస్తున్నా అని, చేతనైతే ప్రభుత్వం సమస్యలను త్వరగా పరిష్కరించాలన్నారు. నల్లగొండకు కల్వకుంట్ల కవిత రానున్న నేపథ్యంలో ఆమె అభిమానులు కటౌట్‌లు, ప్లెక్సీలు ఏర్పాటు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన కటౌట్‌లు, ప్లెక్సీలను మున్సిపల్ సిబ్బంది తొలగించింది. 'సుంకిశాల లిఫ్ట్ ఇరిగేషన్ కాంట్రాక్టర్‌పై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఎస్ఎల్‌బీసీ ఘటనపై విచారణ జరగాలి. నాగార్జున సాగర్ ఎడమ కాలువను రాష్ట్ర ప్రభుత్వం తమ అధీనంలోకి తీసుకోవాలి. కృష్ణా జలాలను నల్లగొండకు తీసుకురాకపోతే.. భూ నిర్వసితులతో ముఖ్యమంత్రి ఇల్లు ముట్టడిస్తాం' అని అన్నారు. 'బీఆర్ఎస్‌ను తిట్టి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. అయినా కూడా కాంగ్రెస్ అదే నిర్లక్ష్యం చేస్తుంది. సీఎం ఆదేశాలను కలెక్టర్‌లు పట్టించుకోవడం లేదు. మా ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఆసుపత్రిలో ఎపిడ్యూరల్ మెడిసీన్ అందివ్వకపోవడం బాధ అనిపించింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఎపిడ్యూరల్ మెడిసీన్‌ను ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో ఉంచాలి. కాంగ్రెస్ ప్రభుత్వం భూదాన్ భూములను స్వాధీనం చేసుకోవాలి. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ఎప్పుడు అందుబాటులోకి తీసుకువస్తారో సీఎం చెప్పాలని కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని కవిత విమర్శించారు. గత 12 ఏళ్లలో పూర్తి స్థాయిలో జిల్లాకు కృష్ణా జలాలు అందాయో లేదో ఆలోచించాలని అన్నారు. సుంకిశాల రిటైనింగ్ వాల్ కూలిపోతే కాంట్రాక్టర్‌ను ఒక్క మాట అనలేదని.. ప్రాజెక్టుల పరిశీలనలో తాము వెళ్తే నిర్వాసితులు కన్నీరు పెడుతున్నారన్నారు. ఇదేనా బంగారు తెలంగాణ అని ప్రశ్నించారు. నల్గొండ జీజీహెచ్ మెటర్నిటీ వార్డులో కనీస వసతులు లేవన్నారు. ఐసీయూలో ఒక్కో బెడ్‌కు ఇద్దరిని పడుకోబెడుతున్నారని తెలిపారు. ప్రసవ సమయంలో ఇచ్చే ఎపిడ్యూరల్ మందు లేకపోవడం బాధాకరమని కవిత అన్నారు. ఎస్-ఎల్‌బీసీ టన్నెల్ ఎప్పుడు పూర్తి అవుతుందని ప్రశ్నించారు. భూదాన్ భూములు ఎందుకు వెనక్కి తీసుకోలేదని నిలదీశారు. నాగార్జున సాగర్ రైట్ బ్యాంక్ ఏపీ చేతిలో ఉందని.. లెఫ్ట్ బ్యాంక్ పూర్తిగా సెంట్రల్ చేతులో పెట్టారన్నారు. సామాజిక తెలంగాణ రావాల్సి ఉందని... అందుకోసం తెలంగాణ జాగృతి పోరాడుతుందని స్పష్టం చేశారు. 20 శాతం తేమ ఉన్నా పత్తిని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులను ఇబ్బందులు పెడుతోన్న నిబంధనలను సడలించాలన్నారు. కాగా.. నల్గొండ పట్టణంలో పర్యటించిన కవిత.. .జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించి రోగులతో మాట్లాడారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అయితే కవిత పర్యటన నేపథ్యంలో నల్గొండలో హోర్డింగ్‌లు, ప్లెక్సీలను జాగృతి నాయకులు ఏర్పాటు చేశారు. కానీ రాత్రికి రాత్రే హోర్డింగ్‌లు, ప్లెక్సీలను మున్సిపల్ అధికారులు తొలగించారు. దీనిపై కవిత స్పందిస్తూ.. నల్గొండలో కోమటిరెడ్డికి తనకు పంచాయతీ లేదని.. కానీ తన ప్లెక్సీలు తొలగించారని మండిపడ్డారు. అరెస్టు చేసిన జాగృతి నాయకులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై స్పందించేందుకు నల్గొండ వచ్చానని... పాలిటిక్స్ చేసేటప్పుడు గట్టి వాళ్లనే జాగృతి పోటీలో నిలబెడుతోందని అన్నారు. జాగృతి నాయకులతో పెట్టుకున్నోళ్లు బాగుపడలేదని కవిత వ్యాఖ్యలు చేశారు.

## 26/11 ముంబయి దాడుల తరహాల పేలుళ్లకు కుట్ర

**భారీగా పేలుడు పదార్థాలు సిద్ధం చేస్తున్న ఉగ్రవాదులు**

**ఢిల్లీ ఎర్రకోట పేలుడుతో తవ్వుతున్నకొద్దీ పలు విషయాలు వెల్లడి**

న్యూఢిల్లీ,

:ఎర్రకోట వద్ద పేలుడు ఘటనపై ముమ్మరంగా దర్యాప్తు కొనసాగుతోంది. దిల్లీలోని ఎర్రకోట వద్ద పేలుడు ఘటనలో తవ్వే కొద్దీ సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. పేలుడుకు కారణమైన వైద్యుల టెర్రర్ మాడ్యూల్ వెనక పాక్ కేంద్రంగా



పనిచేస్తోన్న జైషే మహ్మద్ ఉగ్ర ముఠా ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. దిల్లీలో వరుస పేలుళ్ల కోసం ఉగ్రవాదులు జనవరి నుంచి పథక రచన చేస్తున్నట్లు విచారణలో తేలినట్లు సమాచారం. 26/11 ముంబయి దాడుల తరహాలో దేశ రాజధానిలో వరుస పేలుళ్లకు ఉగ్రవాదులు కుట్ర పన్నినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. వీరి టార్గెట్ లిస్ట్‌లో ఎర్రకోటతో పాటు ఇండియా గేట్ వంటి ఇతర ప్రముఖ కట్టడాలు ఉన్నట్లు దర్యాప్తు వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఇందుకోసం భారీగా బాంబులను కూడా తయారుచేస్తున్నట్లు పేర్కొన్నాయి. దిల్లీ పేలుడు కేసును ఎన్ఐఏ దర్యాప్తు చేస్తోంది. ఇందుకోసం 10 మంది సభ్యులతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటుచేసింది. జమ్మూకశ్మీర్, దిల్లీ, హరియాణా పోలీసుల నుంచి కేసు డైరీలను తీసుకొని అన్ని కోణాల్లో దర్యాప్తు చేపడుతోంది. నిందితుల కార్యకలాపాలు, వారికి అందిన ఆర్థిక సహకారం గురించి ఆరా తీస్తోంది. ఇందులోభాగంగానే పలు అనుమానితులు, నిందితులను విచారించి వారి నుంచి కూపీ లాగుతున్నారు.

## తమది పేదల ప్రభుత్వం

మొదటి తరువాయి

ముఖ్యమంత్రి ప్రారంభించారు. 17 నెలల్లో ఇళ్లు పూర్తిచేసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం ప్రసంగించిన సీఎం చంద్రబాబు ఇళ్లు లేని పేదల పేర్లు నమోదు చేస్తున్నామని పేర్కొన్నారు. ఆయా కుటుంబాలను కలిపేందుకు పక్కపక్కనే రెండు ఇళ్లు ఇస్తామని స్పష్టం చేశారు. ఇంటిపై సోలార్ పెట్టుకునేలా ప్రోత్సహిస్తామని ప్రకటించారు. ఇళ్లపై, పొలాల్లో కరెంట్ తయారు చేయిస్తున్నామని వివరించారు. సోలార్, విండ్, వాటర్‌తో విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నామని చెప్పుకొచ్చారు. బుధవారం అన్నమయ్య జిల్లాలో సీఎం చంద్రబాబు పర్యటించారు. ఆర్థిక ఇబ్బందులున్నా పథకాలు అమలు చేస్తున్నామని ఉద్ఘాటించారు. ఒక్కరోజే రాష్ట్రంలో మూడులక్షల ఇళ్లకు గృహ ప్రవేశాలు చేయిస్తున్నామని వివరించారు. మిగిలిన ఇళ్లు కూడా వేగంగా పూర్తి చేసి త్వరలోనే అప్పగిస్తామని స్పష్టం చేశారు. నిన్న(మంగళవారం) కనిగిరిలో 97 పరిశ్రమలు ప్రారంభించామని తెలిపారు. ప్రతి కుటుంబంలో ఒక పారిశ్రామికవేత్త తయారు కావాలని సూచించారు. ప్రతి నియోజకవర్గంలో పార్కులు ఏర్పాటు చేస్తామని ఉద్ఘాటించారు.మహిళలను పారిశ్రామికవేత్తలుగా తయారుచేసే బాధ్యత తనదని పేర్కొన్నారు. 2029 నాటికి పేదలకి సొంతిల్లు ఉండాలనేది తన లక్ష్యమని నొక్కిచెప్పారు. ఇళ్లు అంటే నాలుగు గోడలు కాదని.. భవిష్యత్‌కు భద్రత అని అభివర్ణించారు. జగన్‌పై సీఎం చంద్రబాబు షాకింగ్ కామెంట్స్ చేశారు. జగన్‌రెడ్డి ఐదేళ్లలో ఏపీని నాశనం చేశారని ధ్వజమెత్తారు. వైసీపీ హయాంలో ఆర్థికంగా రాష్ట్రం దివాళా తీసిందని విమర్శించారు.

# వాతావరణ మార్పులు, పాఠశాలల బాధ్యతపై శిక్షణ

**కడ్తాల్, నవంబర్ 12 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్ )**

తెలంగాణ వాతావరణ మార్పులు పాఠశాలల బాధ్యత లీడర్షిప్ ప్రోగ్రామ్ అనే అంశంపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలంలోని ఎర్త్ సెంటర్ అన్మాస్ పల్లి ప్రాంగణంలో ప్రారంభించారు. తెలంగాణ వ్యాప్తంగా 33 జిల్లాలకు చెందిన 200 పైగా సైన్స్ ఉపాధ్యాయులు ఈ శిక్షణ అవగాహన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ జి.చంద్రశేఖర్ రెడ్డి తెలంగాణ ప్రధాన సమాచార కమిషనర్ మాట్లాడుతూ గ్రామాలలోని పరిసరాలలోని పర్యావరణ వాతావరణ సమస్యల పట్ల అవగాహన పెంచేందుకు సైన్స్ అధ్యాపకులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రముఖ పర్యావరణవేత్త ప్రొఫెసర్ పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ పర్యావరణ అంశాలపై సైన్స్ టీచర్స్ బాధ్యతతో బాధ్యతగా తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సీనియర్ సామాజిక శాస్త్రవేత్త డా. డబ్ల్యూ జి ప్రసన్నకుమార్ , ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ ఎన్. ఉపేందర్ రెడ్డి, వందేమాతరం ఫౌండేషన్ అధ్యక్షులు టి రవీందర్ రావు, తెలంగాణ బాలాజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం మరియు తెలంగాణ ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం సభ్యులు కార్యవర్గ సభ్యులు తెలంగాణ ప్రముఖ విద్యావేత్త కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ స్టేట్ కోఆర్డినేటర్ యానాల వెంకట్ రెడ్డి, సిజిఆర్ ఫౌండర్ వ్యవస్థాపకులు లీలా లక్ష్మారెడ్డి, సిజేఆర్ మెంబర్స్, పర్యావరణవేత్తలు, విద్యావేత్తలు, పలువురు పాల్గొన్నారు.




# తమిళనాడు పరిశీలకుడిగా అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ



**అమ్రాబాద్, నవంబర్ 12(నీలగిరి ఎక్స్ ప్రెస్):**

కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సంఘటన సృజన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా తమిళనాడు రాష్ట్రానికి ఏఐసీసీ పరిశీలకుడిగా అచ్చంపేట ఎమ్మెల్యే, నాగర్‌కర్నూల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ నియమితులయ్యారు.ఈ కీలక నిర్ణయాన్ని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, ఏఐసీసీ ఆర్గనైజేషన్ జనరల్ సెక్రటరీ కేసి వేణుగోపాల్, ప్రియాంక గాంధీ వాద్రా మద్దతుతో తీసుకున్నారు.తన నియామకంపై స్పందించిన డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ తమిళనాడులో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి భాగస్వామ్యం కావడం గర్వకారణమని, ఈ బాధ్యత పార్టీపై ఉంచిన విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు. గ్రామస్థాయిలో బూత్ కమిటీ విస్తరణ, యువత -మహిళల భాగస్వామ్యంపై ప్రత్యేక దృష్టి సారించి పార్టీని మరింత బలపరచే కృషి చేస్తానని తెలిపారుతనను ఈ బాధ్యతకు ఎంపిక చేసిన ఏఐసీసీ నేతలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# డ్రగ్స్ వద్దు - భవిష్యత్ ముద్దు







**ఆమనగల్లు, నవంబర్ 12(నీలగిరి ఎక్స్ ప్రెస్):**

ఆమనగల్లు పట్టణంలోని కళ్యాణి గార్డెన్స్‌లో "డ్రగ్స్ వద్దు- భవిష్యత్ ముద్దు" అనే నినాదంతో విద్యార్థుల అవగాహన సదస్సు ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సామాజిక సేవకుడు పాపిశెట్టి రాము, మాజీ సీఐ బాధ్య నాయక్ చౌహాన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పాపిశెట్టి రాము మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్ బారిన పడితే తమ బంగారు భవిష్యత్తును పాడు చేసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అపరిచితుల మాటలను నమ్మి తప్పుదారిలో నడవకూడదని, డ్రగ్స్ వినియోగంపై అనుమానం కలిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. విద్యార్థులు దేశ భవిష్యత్తుకు పునాదులని, వారు సంఘటితంగా ఉండి సమాజానికి నంది పలకాలని ఆయన పిలుపునిచ్చారు.సదస్సు అనంతరం విద్యార్థులు ర్యాలీ నిర్వహించి, ఆటపాటలతో పాటు నృత్య ప్రదర్శనల ద్వారా "డ్రగ్స్ వద్దు - మన భవిష్యత్తు ముద్దు" అనే సందేశాన్ని ప్రజలకు చేరవేశారు.ఈ కార్యక్రమంలో సిడిపిఓ శాంతి రేఖ, టి.ఎస్.ఎస్.ఓ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్, తెలంగాణ యూనియన్ ఫిలిం డాన్సర్ ప్రభుశంకర్, రాజు డాన్స్ మాస్టర్, టి.ఎస్.ఎస్. సోషల్ మీడియా ఇన్‌చార్జ్ మీసాల వర్షిత్ (చిక్కి), లక్మాల్ల శివతో పాటు గర్ల్స్ హై స్కూల్, లిటిల్ స్కాలర్ హై స్కూల్, అరబిందో హై స్కూల్, వివేక విద్యా భారతి హై స్కూల్, ప్రజ్ఞ స్కూల్, లిటిల్ స్కాలర్ టెక్నో స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

# మహబూబాబాద్ పట్టణంలో లాడ్జీల తనిఖీలు



**మహబూబాబాద్, నవంబర్ 12(నీలగిరి ఎక్స్ ప్రెస్):**

జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఆదేశాల మేరకు, టౌన్ డీఎస్పీ తిరుపతిరావు సూచనలతో పట్టణంలోని పలు లాడ్జీలలో టౌన్ ఇన్స్పెక్టర్ మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు.వివిధ అవసరాల నిమిత్తం జిల్లా కేంద్రానికి వచ్చి లాడ్జీలలో బసచేసే వారి వివరాలు, లాడ్జీల రికార్డులను పట్టణ సీఐ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లాడ్జీల్లో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు తావివ్వకుండా జాగ్రత్తలు వహించాలని, బసచేసే వారి వద్దనుండి సరైన ధ్రువీకరణ పత్రాలు తీసుకోవాలని, పూర్తి వివరాలు రికార్డుల్లో నమోదు చేయాలని సూచించారు. సీసీ కెమెరాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, చట్ట విరుద్ధంగా ఎవరికీ గదులు ఇవ్వవద్దని హెచ్చరించారు.అనుమానాస్పద వ్యక్తుల వివరాలను వెంటనే పోలీసులకు తెలియజేయాలని, నిబంధనలు పాటించని వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో టౌన్ ఎస్ఐలు చ. అరుణ్ కుమార్, ముహమ్మద్ అలీం హుస్సేన్, ఉ. సూరయ్యతో పాటు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# ముప్పిరెడ్డిపల్లిలో కమ్యూనిటీ కనెక్ట్ విత్ పీపుల్ కార్యక్రమం





**మనోహరాబాద్, నవంబర్ 12(నీలగిరి ఎక్స్ ప్రెస్):**

మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలంలోని ముప్పిరెడ్డిపల్లి గ్రామంలో బుధవారం కమ్యూనిటీ కనెక్ట్ విత్ పీపుల్ కార్యక్రమం నిర్వహించినట్టు తూప్రాన్ ఎస్‌డీపీఓ నరేందర్ గౌడ్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ప్రజల భద్రతను బలోపేతం చేయడం, గ్రామాల్లో నేరాల నివారణ, చట్టవ్యవస్థ పరిరక్షణ, పోలీసు-ప్రజల మధ్య నమ్మకం పెంపొందించడం లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టినట్టు వివరించారు. కమ్యూనిటీ కనెక్ట్ విత్ పీపుల్ ద్వారా నేరాలు, మత్తు పదార్థాల వినియోగం, చట్టవిరుద్ధ కార్యకలాపాలను అరికట్టడం, మహిళల భద్రత, వృద్ధులు -పిల్లల రక్షణపై అవగాహన కల్పించడం, యువతలో చట్టపరమైన అవగాహన పెంపొందించడం, అనుమానాస్పద వాహనాలు -వ్యక్తులు -ప్రాంతాలపై పర్యవేక్షణ బలోపేతం చేయడం లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.గ్రామంలోని వీధులు, ఇళ్లు, షాపులు, అనుమానాస్పద ప్రదేశాలను పూర్తిగా తనిఖీ చేసినట్టు తెలిపారు. 67 టూ వీలర్లు, 4 ఫోర్ వీలర్లు ఎలాంటి ధృవీకరణ పత్రాలు లేకపోవడంతో ధృవీకరించినట్టు వెల్లడించారు. వాహనాల రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ లైసెన్స్, ఐడెంటిటీ వివరాలు పరిశీలించి అనుమానాస్పద వ్యక్తుల వివరాలు సేకరించినట్టు చెప్పారు. ఎలాంటి అనుమానాస్పద కదలికలు గమనించిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలకు సూచించారు.మత్తు పదార్థాల వినియోగం, సైబర్ మోసాలు, గృహహింస, మహిళలపై వేధింపులు వంటి నేరాలపై అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల రక్షణ, శాంతి, భద్రత కోసం పోలీసులు ఎల్లప్పుడూ కట్టుబడి ఉన్నారని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో తూప్రాన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రంగ క్రిష్ణ, మనోహరాబాద్ ఎస్ఐ సుభాష్ గౌడ్‌తో పాటు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, సబ్‌ఇన్‌స్పెక్టర్లు, కానిస్టేబుళ్లు, ఆర్మ్డ్ రిజర్వ్ సిబ్బంది మొత్తం 90 మంది పాల్గొన్నారు.

# పదర మండలంలో బిజెపి బూత్ కమిటీల సమీక్షా సమావేశం



**ఆమ్రాబాద్, నవంబర్ 12 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**

పదర మండల కేంద్రంలో బిజెపి మండల అధ్యక్షుడు నీలం రవి ముదిరాజ్ అధ్యక్షతన బూత్ కమిటీల సమీక్షా సమావేశం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బిజెపి మండల ఇన్‌చార్జ్, జిల్లా కార్యదర్శి వరికుప్పల ఆంజనేయులు మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలో బూత్ కమిటీలు ఏర్పాటు చేసి పార్టీ శక్తిని మరింత బలోపేతం చేయాలని సూచించారు.సమావేశంలో బిజెపి జిల్లా నాయకులు గోలి శ్రీను, మండల ఉపాధ్యక్షులు మేకుటి శ్రీనివాసులు, మండల ప్రధాన కార్యదర్శులు కాట్రాజు ఆంజనేయులు, కల్విరికి రవి కుమార్, రాము యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# నస్పూర్ పోలీస్ స్టేషన్ తనిఖీ చేసిన కమిషనర్

**పెద్దపల్లి, నవంబర్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఐపీఎస్ నస్పూర్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు.ప్రజల ఫిర్యాదులకు తక్షణ స్పందనతో భరోసా కల్పించాలని అధికారులకు సూచించారు. స్టేషన్ రిసెప్షన్, సిసిటిఎన్ఎస్ విభాగాలు, పెండింగ్ కేసులు, కోర్టు కేసులు, దర్యాప్తులో ఉన్న కేసులను పరిశీలించి ఆదేశాలు జారీ చేశారు.



గ్రామాలు, కాలనీల్లో విజిబుల్ పోలీసింగ్, పెట్రోలింగ్ నిర్వహించి ప్రజల్లో విశ్వాసం పెంపొందించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు రోడ్ సేఫ్టీ కమిటీలు ఏర్పాటు చేసి బ్లాక్ స్పాట్లలో చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ నెల 15న జరిగే లోక్ అదాలత్‌లో రాజీ పడదగిన కేసులను పరిష్కరించాలన్నారు. అనంతరం స్టేషన్ ఆవరణలో మొక్కను నాటారు. తనిఖీల్లో డీసీపీ ఏ. భాస్కర్, ఏసీపీ ప్రకాష్, సీఐ అశోక్ కుమార్, ఎస్.ఐ ఉపేందర్ పాల్గొన్నారు.

# కొత్తిరెడ్డిని పరామర్శించిన ఎమ్మెల్సీ భాను ప్రసాద్ రావు



**ఎలిగేడు, నవంబర్ 12(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఎలిగేడు మండలంలోని నారాయణపల్లి గ్రామానికి చెందిన కొత్తిరెడ్డి చంద్రారెడ్డి, మల్లారెడ్డి వారి తల్లి కొత్తిరెడ్డి సుగుణమ్మ ఇటీవల మృతి చెందగా, వారి కుటుంబాన్ని బుధవారం ఎమ్మెల్సీ తానుపర్తి భాను ప్రసాద్ రావు పరామర్శించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలియజేసి, మనోధైర్యాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎలిగేడు సింగిల్ విండో చైర్మన్ గోపు విజయభాస్కర్ రెడ్డి, మాజీ కెడీసీసీ బ్యాంకు డైరెక్టర్ కొక్కిరాల మహేశ్వరావు, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ మండిగ రేణుక రాజ నరసయ్య, మాజీ సర్పంచ్‌లు ప్రసాదరావు, వేణు మాధవరావు, దూళికట్ట మాజీ ఎంపీటీసీ మారం కొమురయ్య, గజ్జల తిరుపతి, సుల్తానాపూర్ మాజీ సర్పంచ్ తానుపర్తి సునీత, సుధాకర్ రావు, మాజీ సింగిల్ విండో చైర్మన్ నరహరి సుధాకర్ రెడ్డి, నారాయణపల్లి మాజీ సర్పంచ్ మాడ కొండల్ రెడ్డి, ఎలిగేడు మాజీ ఎంపీటీసీ కరివేద సుధాకర్ రెడ్డి, రైతు సమన్వయ కమిటీ మాజీ చైర్మన్ కొత్తిరెడ్డి శరత్ రెడ్డి, కళ్ళం శ్రీనివాస్ రెడ్డి, ఎలిగేడు మాజీ ఉపసర్పంచ్ గుడుగుల మహేందర్, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు ఎండి ఖలీల్, సంతోష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా శ్రీ సద్గురు రాజమాత దేవి పుట్టినరోజు వేడుకలు





**ఎలిగేడు, నవంబర్ 12(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
సుల్తానాబాద్ మండల కేంద్రంలోని శ్రీ ప్రసన్న బండ్లమాంబ శ్రీ రాజమాత దేవి ఆలయంలో రాజమాత దేవి 80వ పుట్టినరోజు వేడుకలను భక్తులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం అభిషేకములు, పాదపూజలు, కార్తీకమాస ప్రత్యేకంగా శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. గత 14 సంవత్సరాలుగా అమ్మగారి పుట్టినరోజు వేడుకలు ఈ ఆలయంలో జరుగుతుండగా, భక్తులు అధిక సంఖ్యలో హాజరై తమ కోరికలు తీర్చే మాతగా ఆలయానికి ప్రత్యేక గుర్తింపు ఏర్పడింది. వేడుకల అనంతరం తీర్థ ప్రసాదం, మహా అన్నప్రసాదం భక్తులకు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మాతా కోటేశ్వరమ్మ, ఎల్లంకి ప్రభాకర్, ఎలిగేటి తుకారాం, దీకొండ తిరుపతి, వల్లాల అంజన్న, చక్కిలం మారుతి పాల్గొన్నారు. మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారి పుట్టినరోజు వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.

# జిల్లా కలెక్టరేట్‌లో దిశ కమిటీ సమావేశం





**మహబూబాబాద్, నవంబర్ 12(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
జిల్లా కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం కమిటీ చైర్మన్, పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్ అధ్యక్షతన ప్రారంభమైంది. ఈ సమావేశంలో ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రు నాయక్, జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్, మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్, అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, (రెవెన్యూ) కె. అనిల్ కుమార్, జిల్లా దిశ కమిటీ సభ్యులు, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, జిల్లా అధికారులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా ప్రారంభమైన జిల్లా స్థాయి యువజన ఉత్సవాలు



**మహబూబాబాద్, నవంబర్ 12(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
మహబూబాబాద్ పట్టణంలోని జిల్లా ప్రజా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో జిల్లాస్థాయి యువజన ఉత్సవాలు -25 అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో హాజరై, స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ యువజన ఉత్సవాలు పురస్కరించుకొని దేశవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలలో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, జిల్లాలోని యువతీ -యువకులు సామాజిక అంశాలు, విద్య, క్రీడలు, సాంస్కృతిక ప్రదర్శనలు, వ్యాసరచన, కవిత్వం, ఎగ్జిబిషన్లు, పెయింటింగ్స్, కథారచనలు, జానపద నృత్యం వంటి విభాగాలలో తమ ప్రతిభను కనబరచడానికి ఇది ఒక మంచి వేదికగా ఉంటుందని తెలిపారు. విద్యతోపాటు క్రీడలు, సామాజిక అంశాలలో యువత ముఖ్యపాత్ర వహించాలని సూచించారు. మానసిక - శారీరకంగా దృఢంగా ఉండి ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనే శక్తి కలుగుతుందని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన వారిని గుర్తించి, జనవరి 12న న్యూఢిల్లీలో జరగబోయే జాతీయ యువజన ఉత్సవాలకు పంపనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి దక్షిణామూర్తి, డిపిఆర్ఓ రాజేంద్రప్రసాద్, జిల్లా క్రీడల అధికారి జ్యోతి, సైన్స్ అధికారి అప్పారావు పాల్గొని యువతను ఉద్దేశించి ప్రసంగించారు. వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను వారు ఆస్వాదించారు. హెడ్మాస్టర్ అప్పారావు, శ్యామలాదేవి, కీర్తన రెడ్డి, సురేష్, శ్రీరాములు, శ్రీలత, సునీత, ఎండి నయీమ్, వెంకటేశ్వర్లు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# సోమయ్య కుటుంబాన్ని పరామర్శించిన రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ గోలి శ్రీనివాసరెడ్డి



**వెల్దండ, నవంబర్ 12 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
వెల్దండ మండలంలోని లింగారెడ్డి పల్లి గ్రామానికి చెందిన సాక్షి దినపత్రిక సీనియర్ జర్నలిస్టు, గ్రామ మాజీ సర్పంచ్ సోమయ్య మంగళవారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ నాయకులు, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాసరెడ్డి, కల్వకుర్తి మాజీ మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం బుధవారం గ్రామానికి వెళ్లి సోమయ్య మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించిన గోలి శ్రీనివాసరెడ్డి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేసి, బిఆర్ఎస్ పార్టీ తరఫున అన్ని విధాల సహాయం అందిస్తామని భరోసా కల్పించారు. కల్వకుర్తి మాజీ మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం కూడా రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని సోమయ్య తల్లికి అందజేశారు. ఈ సందర్భంగా వెల్దండ మాజీ ఎంపీపీ పుట్టారామిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ వెంకటయ్య గౌడ్, సింగిల్ విండో డైరెక్టర్ నాగులు నాయక్, పోతేపల్లి మాజీ సర్పంచ్ వెంకట్ రెడ్డి, వెల్దండ మాజీ ఉపసర్పంచ్ నిరంజన్, మాజీ ఎంపీటీసీ జ్యోతి నిరంజన్, మార్కెట్ మాజీ డైరెక్టర్ సురమళ్ళ సుభాష్, తలకొండపల్లి బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ రెడ్డి, మండల బిఆర్ఎస్ నాయకులు జంగిలి ఆనంద్, కొండల్ యాదవ్, శ్రీను, అశోక్, ప్రభాకర్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# వెల్దండ బీసీ హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన డిఆర్డిఓ




**వెల్దండ, నవంబర్ 12 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
నాగర్‌కర్నూల్ జిల్లా డిఆర్డిఓ బుధవారం వెల్దండ మండల కేంద్రంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బీసీ బాలుర వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను మెనూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. భోజనం నాణ్యతపై విద్యార్థులు సంతృప్తి వ్యక్తం చేస్తూ, ఫుడ్ చాలా బాగుందని తెలిపారు. డి ఆర్ డి ఓ, ఎంపీడీవో సత్యపాల్ రెడ్డి కలిసి భోజనాన్ని పరిశీలించి, హాస్టల్ వర్కర్లను వివిధ అంశాలపై ప్రశ్నించారు. అదేవిధంగా కొత్తగా నిర్మించిన బాత్రూంలను, హాస్టల్ భవనాన్ని అధికారులు పరిశీలించారు.

# ఈవీఎం గోదాం తనిఖీ



**కరీంనగర్, నవంబర్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లా కలెక్టర్ కార్యాలయం సమీపంలోని ఈవీఎం గోదాంను డిఆర్ఓ బి. వెంకటేశ్వర్లు, ఆర్డిఓ కె. మహేశ్వర్, రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఎప్పటికప్పుడు ఈవీఎం, వివిప్యాట్ గోదాంలను తనిఖీ చేసి నివేదిక పంపుతున్నామని డిఆర్ఓ తెలిపారు. భద్రతా ఏర్పాట్లు, సిబ్బంది హాజరు తీరును పరిశీలించి, విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి, ఎంఐఎం, టిడిపి పార్టీ ప్రతినిధులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

# గంజాయి విక్రయిస్తున్న నలుగురిపై కేసు నమోదు



**మహబూబాబాద్, నవంబర్ 12(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
మహబూబాబాద్ పట్టణంలో టౌన్ ఎస్ఐ టీ. అశోక్ తన సిబ్బందితో పెట్రోలింగ్ చేస్తుండగా, నమ్మదగిన సమాచారం మేరకు పత్తిపాకలోని ఒక ఇంటిలో తనిఖీలు నిర్వహించారు. ఈ సమయంలో నలుగురు యువకులు అనుమానాస్పదంగా కనిపించి, పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించగా సిబ్బంది సహకారంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వారిపేర్లు మండల సంతోష్ కుమార్ (కోయచెలక గ్రామం, ఖమ్మం), షేక్ షకీల్ (కంకరబోర్డు కాలనీ, మహబూబాబాద్), గుగులోతు అనిల్ (గండి తండ, కొల్లాపూర్ గూడూరు మండలం), ఇస్లావత్ సాయి గణేష్ (మార్కండేయ టెంపుల్ కాలనీ, మహబూబాబాద్) అని వెల్లడైంది. వీరు వేరే ప్రాంతాల నుండి గంజాయిని తక్కువ ధరకు తెచ్చి, స్థానిక యువకులకు ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నట్టు ఒప్పుకున్నారు. తనిఖీల్లో వారి వద్ద నుండి సుమారు రూ.85,000 విలువైన ఒక కిలో 750 గ్రాముల గంజాయి ప్యాకెట్, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. నలుగురిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్టు మహబూబాబాద్ టౌన్ సీఐ గట్ల మహేందర్ రెడ్డి వివరించారు.

# మార్కెట్ యార్డ్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



**ఆమనగల్, నవంబర్ 12 (నీలగిరి ఎక్స్ప్రెస్):**
ఆమనగల్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి బుధవారం ప్రారంభించారు. రంగా రెడ్డి జిల్లా ఆమనగల్ మార్కెట్ యార్డ్‌లో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని స్థానిక నాయకులతో కలిసి ఆయన ప్రారంభించి, అనంతరం రైతులకు మద్దతు ధర అందుతున్న విధానాన్ని సమీక్షించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ధాన్యం కొనుగోలు జరగాలని సూచిస్తూ, మద్దతు ధరను సమయానికి అందించేందుకు అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ యాట గీత నరసింహ ముదిరాజ్, వైస్ చైర్మన్ గూడూర్ భాస్కర్ రెడ్డి, ఆమనగల్ సింగిల్ విండో చైర్మన్ గంప వెంకటేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, అధికారులు, ఆమనగల్, తలకొండపల్లి, కడ్తాల్, మాడుగుల మండలాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, రైతులు పాల్గొన్నారు.

# పీఆర్వో శిక్షణ శిబిరం ముగింపు

**- సర్టిఫికెట్ అందుకున్న కుశల్ కుమార్ కుందోజు**



**మహబూబాబాద్, నవంబర్ 12(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
తెలంగాణ పోలీస్ పీఆర్వోలకు నిర్వహించిన మూడు రోజుల శిక్షణ శిబిరం విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా మహబూబాబాద్ జిల్లా పీఆర్వో కుశల్ కుమార్ కుందోజు గౌరవ తెలంగాణ రాష్ట్ర డీజీపీ శ్రీ శివదర్ రెడ్డి చేతుల మీదుగా సర్టిఫికేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ పీఆర్వోలు ప్రజలతో పోలీసులను కలిపే వంతెనలుగా వ్యవహరించాలని సూచించారు. ప్రతి సంఘటనలో పోలీస్ శాఖ నిజమైన ప్రతిఛాయను సమాజానికి చేరవేయడం వారి ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. "మీ మాట, మీ రాత ప్రజల్లో విశ్వాసం కలిగించేలా ఉండాలి. సమాచారాన్ని సరిగ్గా, సమయానికి అందించడం ద్వారానే పోలీస్ శాఖ ప్రతిష్ట పెరుగుతుంది. సోషల్ మీడియా యుగంలో ప్రొఫెషనల్ కమ్యూనికేషన్ అత్యంత కీలకం" అని ఆయన అన్నారు. శిక్షణ ద్వారా పొందిన నైపుణ్యాలను ప్రాథమిక స్థాయిలో వినియోగించి, పోలీస్ ప్రజల మధ్య అనుబంధాన్ని మరింత బలోపేతం చేయాలని డీజీపీ సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి పోలీస్ అధికారులు, వివిధ జిల్లాల పీఆర్వోలు పాల్గొన్నారు.

# సిపిఐ 100 ఏళ్ల ముగింపు సభకు పార్టీ శ్రేణులు తరలి రండి

**డిండి, నవంబర్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
డిసెంబర్ 26న ఖమ్మంలో జరగబోయే సిపిఐ 100 ఏళ్ల ముగింపు బహిరంగ సభను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులు వేలాదిగా తరలి రావాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహా రెడ్డి పిలుపునిచ్చారు. నల్లగొండ జిల్లా డిండి సిపిఐ కార్యాలయంలో బుధవారం జరిగిన మండల సమితి సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్వహించే ఈ సభకు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలను తరలించేందుకు ప్రచార జాతాలు చేపడుతున్నామని తెలిపారు. నవంబర్ 15 నుండి రాష్ట్రవ్యాప్తంగా మూడు జాతాలు బయలుదేరనున్నాయని, గద్వాల నుండి ప్రారంభమయ్యే జాత 17న డిండికి చేరుతుందని, ఈ జాతాకు సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం. బాల నరసింహ, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ఆధ్వర్యం వహిస్తున్నారని వివరించారు. ఖమ్మంలో జరిగే సభలో లక్షలాది మంది పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. పార్టీ గ్రామ శాఖల్లో సభ్యత్వాన్ని పునరుద్ధరించి,




ఉత్సాహవంతమైన నాయకత్వానికి కొత్త బాధ్యతలు అప్పగించాలని సూచించారు. మహిళలు, రైతులు, యువకులు, విద్యార్థులు భాగస్వామ్యం అయ్యేలా గ్రామ శాఖల్లో కమిటీలను ఏర్పాటు చేసి పార్టీని మరింత బలోపేతం చేయాలని పల్లా నర్సింహా రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి సిపిఐ మండలం సహాయ కార్యదర్శి బొల్లె శైలేశ్ అధ్యక్షత వహించారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తూం బుచ్చిరెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎండి. మైనోద్దీన్, మండల కార్యదర్శి శ్రీ రామదాసు కనకాచారి, సహాయ కార్యదర్శి తిప్పర్తి విజయేందర్ రెడ్డి, సభ్యులు రవీంద్ర శర్మ, ఎలిమినేటి హుస్సేన్, హనుమాన్ల కేశవులు, సోమిడి శ్రీనయ్య, నూనె వెంకటేశ్వర్లు, లచ్చయ్య, శాఖ కార్యదర్శులు శ్రీనివాస్ రెడ్డి, గొడుగు శ్రీను, శివ, చక్రి, ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి నవీన్, ఏఐఎస్ఎఫ్ డివిజన్ అధ్యక్షుడు వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ కార్యకర్తను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

**-రమావత్ రవీంద్ర కుమార్.**



**డిండి నవంబర్ 12. నీలగిరి ఎక్స్ ప్రెస్).**
డిండి మండలం గోనకోల్ కు గ్రామానికి చెందిన ఏషోబ్ అనారోగ్యంతో హైదరాబాద్ లోని ప్రగ్మ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నారు.బుధవారం హైదరాబాద్ లోని ప్రగ్మ హాస్పిటల్ లో ఏషోబ్ ని బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు, మాజీ దేవరకొండ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు ఆయన సూచించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.ఆయన వెంట బిఆర్ఎస్ పార్టీ మండల మండల అధ్యక్షులు రాజీనేని వెంకటేశ్వర్ రావు,తదితరులు ఉన్నారు.

# ఈర్ల స్వరూప సురేందర్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే విజయరమణ రావు



**పెద్దపల్లి, నవంబర్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఈర్ల స్వరూప సురేందర్ గారి కుమారుడు విశ్వతేజ్ బుధవారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలిసి పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు విశ్వతేజ్ పార్థీవ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఈర్ల స్వరూప సురేందర్‌ను పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా వారు భగవంతుడు కుటుంబానికి మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. అనంతరం అంతిమయాత్రలో కూడా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ చైర్మన్లు, డైరెక్టర్లు, సింగిల్ విండో చైర్మన్లు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు పలువురు పాల్గొన్నారు.

# లంచం అడిగితే వెంటనే సమాచారం ఇవ్వండి

**- ఎసిబి డీఎస్పీ**

**కరీంనగర్,
నవంబర్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**




సమాజంలో అవినీతి పెద్ద సమస్యగా మారిందని, దాన్ని అరికట్టే శక్తి ప్రజల చేతుల్లోనే ఉందని ఎసిబి డీఎస్పీ విజయ్‌కుమార్ అన్నారు. లంచం అడగడం, తీసుకోవడం, ఇవ్వడయ అన్ని నేరమని ఆయన స్పష్టం చేశారు. ఎవరైనా ప్రభుత్వ అధికారి లంచం అడిగితే భయపడకుండా వెంటనే 1064 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని, ఒక కాల్‌తోనే చర్యలు తీసుకుంటామని తెలిపారు. అవినీతి రహిత తెలంగాణ సాధనలో ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని, సత్యం కోసం సంకల్పంతో ముందుకు సాగాలని డీఎస్పీ పిలుపునిచ్చారు.

# ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

**-మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి**




**నల్లగొండ, నవంబర్ 12( నీలగిరి ఎక్స్ ప్రెస్):**
నల్లగొండ జిల్లా కలెక్టరేట్లో జిల్లా అధికారులు,రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ,రాత్రి పగలు పనిచేసి ధాన్యం సేకరణను పూర్తిచేయాలని ఆదేశించారు.రైతులు ఎదుర్కొన్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు పంపించాలని,రైతులను తేమ,తరుగు,తాలు పేర్లతో ఇబ్బంది పెట్టవద్దని హెచ్చరించారు.కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు,ప్యాడి క్లీనర్లు,తేమ యంత్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు అదేవిధంగా పత్తి కొనుగోలు నిబంధనల సడలింపుపై కేంద్రానికి నివేదిక పంపామని,బాయిల్డ్ రైస్ కోటా,బకాయిల విషయంలో ముఖ్యమంత్రితో,ఎఫ్సీఐ అధికారులతో చర్చిస్తామని తెలిపారు.

# సదరం కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



**నల్లగొండ ,నవంబర్ 12 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
రాష్ట్ర రోడ్డు,భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి శ్రీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి బుధవారం నల్లగొండ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో రూ. 15 లక్షల వ్యయంతో నిర్మించిన (సదరం శిబిరం) ప్రత్యేక వైకల్య గుర్తింపు కార్డు జారీ కేంద్రం భవనంను నేడు ప్రారంభించారు.ఈ కేంద్రం ద్వారా దివ్యాంగులకు సులభంగా,వేగంగా గుర్తింపు కార్డులు జారీ చేసే సదుపాయం లభించనుందని దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల్లో ఇది మరో ముఖ్యమైన అడుగు అని తెలిపారు.

# బోడుప్పల్ ప్రధాన రహదారిపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు



**బోడుప్పల్, నవంబర్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బోడుప్పల్ మల్లాపూర్ ప్రధాన రహదారి డంపింగ్ యార్డ్ దగ్గర అధికారులు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా 13వ డివిజన్ మాజీ కార్పొరేటర్ శ్రీమతి దానగళ్ళ అనిత యాదగిరి మాట్లాడుతూ, ఈ ప్రాంతంలో పదుల సంఖ్యలో రోడ్డు ప్రమాదాలు తరచుగా జరుగుతున్నాయని, వేగం కన్నా ప్రాణం ముఖ్యమని ప్రజలకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా రాజీవ్ నగర్, దేవేందర్ నగర్, పేస్ -1, పేస్ -2, అంబేద్కర్ నగర్ కాలనీల వాసులు ప్రమాదాలకు గురవుతున్న నేపథ్యంలో సంబంధిత అధికారులతో చర్చించి, స్వయంగా పర్యవేక్షణ చేసి స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయించామని తెలిపారు. త్వరలోనే విద్యుత్ అధికారులతో చర్చించి ప్రధాన రహదారి వెంట స్ట్రీట్ లైట్లు ఏర్పాటు అయ్యేలా కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు గోపు రాములు, కాలనీ ఉపాధ్యక్షులు నానాజీ, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో ఖేల్ ఉత్సవ్

**కరీంనగర్, నవంబర్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కొత్తపల్లి అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో "ఖేల్ ఉత్సవ్" ఘనంగా జరిగింది. విద్యార్థుల్లో క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించేందుకు, నైపుణ్యం సాధించేలా శిక్షణ ఇవ్వాలని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.వి. నరేందర్ రెడ్డి సూచించారు. విద్యార్థులకు నిపుణుల శిక్షణతో పాటు పాఠశాల స్థాయిలో పోటీలు నిర్వహించి ప్రతిభావంతులను ఎంపిక చేస్తున్నామని తెలిపారు. వార్షిక ప్రణాళికలో భాగంగా వివిధ క్రీడల పోటీలు నిర్వహించి, బాలల దినోత్సవం సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేస్తామని చెప్పారు. ఉత్సవంలో ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, త్రోబాల్, నెట్‌బాల్, ఖోఖో, కబడ్డి, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, చెస్ వంటి క్రీడలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో



పాఠశాల ప్రిన్సిపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# చేనేత, పవర్ లూమ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి 20న కమిషనర్ కార్యాలయం ముందు మహాధర్నా

## కరపత్రాన్ని ఆవిష్కరించిన గంజి మురళీధర్



**నల్లగొండ నవంబర్ 12 ( నీలగిరి ఎక్స్ ప్రెస్):** చేనేత కార్మికుల రుణమాఫీ చేయాలని ఎలాంటి షరతులు లేకుండా చేనేత భరోసా జియో టాగ్ ఉన్న అందరికీ అమలు చేయాలని తదితర సమస్యల పరిష్కారానికి నవంబర్ 20న హైదరాబాద్ నాంపల్లి కమిషనర్ కార్యాలయం ముందు జరుగు మహాధర్నా జయప్రదం చేయాలని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి మురళీధర్ తెలంగాణ పవర్ లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి దండెంపల్లి సత్తయ్య పిలుపునిచ్చారు బుధవారం దొడ్డి కొమరయ్య భవన్లో హైదరాబాదులో నవంబర్ 20న జరుగు మహాధర్నా కరపత్రాన్ని ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణా రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం చేనేత పరిశ్రమ, కార్మికుల సమస్యలను గాలికి వదిలేసి చేనేత పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న వేలాది కుటుంబాలను వీధి పాలు జేసింది. ముఖ్యమంత్రి శ్రీ ఏ. రేవంత్ రెడ్డి చేనేత కార్మికుల ఋణ మాఫీ ప్రకటించి ఏడాది దాటినా లక్షల కోట్ల బడ్జెట్ లో కేవలం 48 కోట్ల రూపాయల చేనేత కార్మికుల ఋణ మాఫీ నేటి వరకు అమలు చేయలేకపోయారు. చేనేత కార్మికులకు ఋణాలు ఇచ్చిన బ్యాంకులు రుణాలు తీసుకున్న వారి పైన ఒత్తిడి తెస్తూ వారి నైతిక స్థైర్యాన్ని దెబ్బ తీస్తున్నాయి. సహకారోద్యమం స్ఫూర్తి మంట కలిసే విధంగా 12 సంవత్సరాల నుండి చేనేత సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించకుండా మరియు సంఘాల క్యాష్ క్రెడిట్ రుణాలు మాఫీ చేయకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దారుణం. గతంలో లేని విధంగా షరతులు విధించి చేనేత పథకాల అమలులో అవినీతికి ఆస్కారం కల్పిస్తూ చేనేత కార్మికులకు అందని ద్రాక్షలా చేయడమేనన్నది సుస్పష్టం. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికైన నాటి నుండి అనేక సందర్భాలలో అనేక పర్యాయాలు రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ చేనేత కార్మిక సంఘం తరపున వినతి పత్రాలు అందజేసి చర్చలు జరిపినా, అనేక సమస్యలు అందని ద్రాక్షగానే మిగిలిపోయాయి. చేనేత వస్త్ర పరిశ్రమ చేనేత కార్మికుల, చేనేత పారిశ్రామిక సహకార సంఘాల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంతో ప్రత్యక్ష పోరాటానికి సిద్ధం కాక తప్పటం లేదని అన్నారు.సంఘం విజ్ఞప్తి చేస్తున్నది.ముఖ్యమంత్రి హామీ మేరకు చేనేత కార్మికుల ఋణ మాఫీ తక్షణం అమలు చేయాలని, జియో టాగ్ ఉన్న చేనేత కార్మికులందరికి ఎలాంటి షరతులు లేకుండా చేనేత భరోసా పథకం అమలు చేయాలని,పెరిగిన ధరల కనుగుణంగా చేనేత కార్మికులకు వేతనాలను పెంచి అమలు చేయాలని డిమాండ చేశారు. చేనేత పారిశ్రామిక సహకార సంఘాల క్యాష్ క్రెడిట్ ఋణాలను మాఫీ చేయాలని. చేనేత పారిశ్రామిక సహకార సంఘాల క్యాష్ క్రెడిట్ ఋణాలను పునరుద్ధరించాలని కోరారు.చేనేత కార్మికుల, సహకార సంఘాల వద్ద పేరుకు పోయిన వస్త్ర నిల్వలను ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు, చేనేత సహకార సంఘాలకు తక్షణం ఎన్నికలు నిర్వహించి, టెస్కోకు పాలక వర్గాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.మరణించిన చేనేత కార్మికులకు నేతన్న భీమా నెలల కొద్ది తాత్సారం చేయకుండా తక్షణం అందజేయాలని కిరారు.చేనేత వస్త్రాల పైన, ముడి సరుకులైన నూలు, రంగులు, రసాయనాలపై మరియు చేనేత చీరలపై జీరో జి.యస్ టి చేయాలని కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకు రావాలని డిమాండ్ చేశారు..చేనేత కార్మికులకు ఇంటి స్థలంతో బాటు హౌస్ కమ్ వర్క్ షెడ్ లను ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద నిర్మించాలి.చేనేత కార్మికులకు ఉపాధి కల్పన కోసం ప్రభుత్వ రంగ సంస్థలకు ఏక రూప దుస్తులను చేనేత మగ్గాలపై నేసినవాటినే అందించాలి.చేనేత కార్మికులకు అయిదు లక్షల వరకు ఆరోగ్య భీమా సదుపాయం కల్పించాలి.అర్హులైన చేనేత కార్మికులకు వేస్తున్న జియో టాగ్ నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తూ అందరికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని, చేనేత వస్త్రాలకు డూప్లికేట్ ప్రింటింగ్ వస్త్రాలను అరికట్టాలి.గతంలో రేషన్ షాపుల ద్వారా జనతా వస్త్రాలు అందించినట్లుగా చేనేత వస్త్రాలైన చీర, ధోవతి, లుంగీ అందించాలి.చేనేత కార్మికులకు పెట్టుబడి సాయం కింద రాయితీతో జీరో వడ్డీతో కొత్త ఋణాలు 5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు..పవర్ లూమ్ కార్మికుల కు వర్క్ టు ఓనర్ పథకం వెంటనే పూర్తి చేసి పవర్ లూమ్ కార్మికులకు అందించాలని,ప్రభుత్వం ఉత్పతి చేస్తున్న వస్త్రాలకు పవర్ లూమ్ కార్మికులకు అనుబంధ కార్మికులకు యారన్ సబ్సిడీ అందించాలని,పవర్ లూమ్ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటుచేసి P.F., ESI కల్పించి ప్రభుత్వ గుర్తింపు కార్డులు ఇవ్వాలని,సిరిసిల్ల పవర్ లూమ్ కు సంబందించిన విద్యుత్ బకాయి బ్యాక్ బిల్ వెంటనే ప్రభుత్వం చెల్లించాలని హైదరాబాదులో నాంపల్లి కమిషనర్ జరుగుతున్న జరుగుతున్న మహా ధర్నాలో చేనేత పవర్లూమ్ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో తెలంగాణ చేనేత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వనం రాములు, తెలంగాణ పవర్లూమ్ వర్కర్స్ జిల్లా అధ్యక్షులు గంజి నాగరాజు చెరుపల్లి బిక్షమయ్య కర్నాటి శ్రీరంగం గుర్రం శ్రీనివాస్ గంజి రాజేష్ ఎక్కల్ దేవి శంకర్, పవర్లూమ్ మహిళా కార్యదర్శి మిర్యాల శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

# పిడుగు తాకి గాయపడిన విద్యార్థికి మంత్రి మానవతా సహాయం









-యశోద హాస్పిటల్ కు 18 లక్షల చెల్లింపు...
-ఎంత ఖర్చైనా సరే... పిల్లవాడి ప్రాణం ముఖ్యం"
-సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్...



**సికింద్రాబాద్, నవంబర్ 12(నీలగిరి ఎక్స్ ప్రెస్):** జగిత్యాల జిల్లా కేంద్రంలోని ధరూర్ క్యాంపు ఎస్సీ బాలుర వసతిగృహంపై 20 రోజుల క్రితం పిడుగు పడటంతో విద్యార్థి బొల్లె హిమేష్ చంద్ర (8వ తరగతి) తీవ్రంగా గాయపడ్డ విషయం తెలిసిందే. పూర్వపరాలలోకి వెళ్తే హాస్టల్ టెర్రస్‌పై ఆరేసిన దుస్తులు తీసుకురావడానికి వెళ్లిన హిమేష్ పై ఒక్కసారిగా పెద్ద శబ్దంతో పిడుగు పడింది. క్షణాల్లోనే మంటలు వ్యాపించి, అతని చేతులు, వెన్ను తీవ్రంగా కాలిపోయాయి. వెంటనే అప్రమత్తతో వెంటనే సిబ్బంది స్పందించి వెంటనే బాలుణ్ని జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు ప్రాథమిక చికిత్స అనంతరం కరీంనగర్ ఆసుపత్రికి, ఆపై పరిస్థితి విషమించడంతో సికింద్రాబాద్ యశోద ఆసుపత్రికి తరలించారు. పిడుగు ప్రభావంతో భవనం పైకప్పు, గోడలు పగిలిపోయాయి. చలించిన మంత్రి అడ్లూరి అధికారులకు ఆదేశాలు ఈ ఘటన విషయం తెలిసిన వెంటనే ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పందించారు.ఇప్పటివరకు 5 సార్లు... మంత్రి పరామర్శ. తీవ్ర గాయాలైన పాలైన విద్యార్థి పట్ల మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటివరకు దాదాపు 5 సార్లు స్వయంగా తన సిబ్బందిని వెంటబెట్టుకొని ఆస్పత్రి సంబంధించి వైద్యులంబిస్తున్న చికిత్సను తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించేలా ఎప్పటికప్పుడు ఆయన వైద్యులకు ఆదేశాలు జారీ చేశారు.జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్‌కు ఫోన్ చేసి ఆదేశిస్తూ విద్యార్థికి అత్యుత్తమ వైద్యం అందించండి, ఎంత ఖర్చైనా సరే, పిల్లవాడి ప్రాణం ముఖ్యం" అని స్పష్టంగా చెప్పారు. దీంతో అధికారులు వెంటనే చర్యలు తీసుకొని, హిమేష్ చంద్ర ప్రత్యేక వైద్యం అందేలా యశోద ఆసుపత్రిలో చేర్పించారు. వైద్యులు నెలరోజులపాటు చికిత్స అందించి, ప్లాస్టిక్ సర్జరీ చేశారు. చికిత్స ఖర్చు దాదాపు 18 లక్షలు కావడంతో, సాధారణ కుటుంబం భరించలేని స్థితి ఏర్పడింది. విషయం తెలిసిన మంత్రి అడ్లూరి మానవతా దృక్కోణంతో నిర్ణయం తీసుకున్నారు.

**బాలుడి ప్రాణం కంటే డబ్బు ముఖ్యం కాదు"**
**మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

మొత్తం వైద్య ఖర్చును షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ నిధుల నుండి చెల్లించాలంటూ మంత్రి ఆదేశాలు జారీ చేశారు. దాంతో సోషల్ వెల్ఫేర్ సెక్రటరీ జ్యోతి బుద్ధ ప్రకాష్, కమిషనర్ ఎన్.క్షితిజ గారు, అడిషనల్ డైరెక్టర్ సి.శ్రీధర్ యశోద ఆసుపత్రికి చెల్లించాల్సిన బిల్లును చెక్కు రూపంలో అందజేశారు.

కన్నీటి పర్యంతుడైన తండ్రి హిమేష్ చంద్ర స్వగ్రామం మల్యాల మండలంలోని మద్దుట్ గ్రామం. అతని తండ్రి బొల్లె శ్రీనివాస్, ఉపాధి కోసం గల్ఫ్ దేశంలో కూలీగా పనిచేస్తున్నారు. కుమారుడు ప్రాణాపాయ స్థితిలో ఉన్న వార్త విన్న ఆయన కన్నీళ్లు పెట్టుకున్నారు.

మంత్రి అడ్లూరి చొరవతో కోరుకుంటున్న కుమారుని చూసి తండ్రి భావోద్వేగంతో మాట్లాడుతూ "నా బిడ్డ ప్రాణం నిలబెట్టింది ప్రభుత్వం. అడ్లూరి లక్ష్మణ్ చూపిన దయ, మానవతా గుణం మా కుటుంబం ఎప్పటికీ మరచిపోలేను అని అన్నారు. ప్రాణం నిలబెట్టిన మానవతా సహాయం యశోద ఆసుపత్రిలో నెలరోజుల చికిత్స అనంతరం హిమేష్ చంద్ర పూర్తిగా కోలుకొని ఇంటికి చేరుకున్నాడు. ప్రస్తుతం అతని ఆరోగ్యం నిలకడగా ఉంది.ఒక చిన్నారి ప్రాణాన్ని రక్షించడంలో మంత్రి అడ్లూరి చూపిన మానవతా స్పందన, దయా హృదయం జగిత్యాల ప్రజల హృదయాలను తాకింది. ప్రజల మధ్య ఇప్పుడు ఒకే మాట వినిపిస్తోంది. మానవత్వమే అసలైన గొప్పతనం. అది చూపించారు అడ్లూరి లక్ష్మణ్ ." ఈ సంఘటన, మానవతా విలువలకు ప్రతీకగా నిలిచింది. ఈ ఘటనతో ప్రజల అభిమానాన్ని ప్రేమను చూరగొన్నారని జిల్లా వాసులు చెబుతున్నారు.

# హాస్టల్లను ఆకస్మిక తనిఖీ చేసిన ఏ ఎస్ డబ్ల్యూ ఓ శ్రీమతి కే.లత









**సూర్యాపేట, నవంబర్ 12)నీలగిరి ఎక్స్ ప్రెస్)** సూర్యాపేట జిల్లా కేంద్రంలోని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ సంక్షేమ వసతి గృహాలను అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ శ్రీమతి కే.లత ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాజరు పట్టికను, నిత్యవసర వస్తువులను పరిశీలించారు. రాత్రివేళ స్టడీ సెంటర్ ను పరిశీలించారు. విద్యార్థులతో ముచ్చటించారు.ఈ కార్యక్రమంలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు శ్రీదేవి, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

# అన్ని గ్రంథాలయాల్లో తెలంగాణ ఉద్యమ పాటల కవితా సంపుటి "నిప్పుల వాగు"



**హైదరాబాద్, నవంబర్ 12(నీలగిరి ఎక్స్ ప్రెస్):** లోకకవి, వాగ్గేయకారుడు అందెశ్రీ గారి అంత్యక్రియలలో పాల్గొన్న ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, అందెశ్రీ సంపాదకత్వంలో వెలువడిన "నిప్పుల వాగు" తెలంగాణ ఉద్యమ పాటల కవితా సంపుటి" పుస్తకాన్ని రాష్ట్రంలోని అన్ని గ్రంథాలయాల్లో ఉంచనున్నట్లు ప్రకటించారు. ఈ గ్రంథంలో తెలంగాణ ఉద్యమాన్ని ప్రతిబింబించే 380 మంది కవులు రచించిన 790 పాటలు, మొత్తం 1307 పేజీలతో కూడిన సాహిత్య సంపుటి ఉంది. గద్దర్, గూడ అంజయ్య, గోరేటి వెంకన్న, సుద్దాల అశోక్ తేజ, జయరాజు, నందిని సిద్దారెడ్డి, సి. కాసిం వంటి ప్రముఖ కవుల రచనలు ఇందులో చోటు చేసుకున్నాయి. "ఒక్కడు లెక్కలేసుకుంటే వచ్చేదేనా తెలంగాణ! కళ్ళు దెరిసిన పసి కూన మొదలు, కాటికి కాళ్లు చాపిన ముసలి వరకు అందరం ఒక్కటైతేనే కదా వచ్చింది తెలంగాణ" అనే అందెశ్రీ గారి ముందుమాట ఈ సంపుటికి ఆత్మగా నిలిచింది. వాకులమ్మ ప్రచురణల ఆధ్వర్యంలో ఐఎస్బిఎన్ నంబర్‌తో వెలువడిన ఈ పుస్తకాన్ని 20,000 కాపీలుగా ముద్రించి, తెలంగాణ వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రంథాలయాలకు పంపిణీ చేయనున్నట్లు సీఎం తెలిపారు.ఈ నిర్ణయం ద్వారా అందెశ్రీ రచనలు, ఉద్యమ గీతాలు, సాహిత్యం భవిష్యత్తులో మరెందరికో స్ఫూర్తినిస్తాయని, కొత్త సాహితీవేత్తలు తయారయ్యే అవకాశాలు పెరుగుతాయని ప్రభుత్వ డిగ్రీ కళాశాల హయత్‌నగర్ లైబ్రేరియన్ డాక్టర్ ఆనందం దుర్గాప్రసాద్ అభిప్రాయపడ్డారు.

# ఎల్లమ్మబండ రైతు బజార్ ఎదురుగా రహదారి మరమ్మత్తులు



**అల్విన్ కాలనీ, నవంబర్ 12(నీలగిరి ఎక్స్ ప్రెస్)** అల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఉషాముళ్ళపూడి ప్రధాన రహదారిలో ఎల్లమ్మబండ రైతు బజార్ ఎదురుగా ఉన్న డంపింగ్ యార్డ్ వద్ద దెబ్బతిన్న రహదారి మరమ్మత్తు పనులను డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ జి.ఎచ్.ఎమ్.సి అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న వర్షానికే రహదారిపై నీరు నిలిచిపోవడం వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. సమస్యను శాశ్వతంగా పరిష్కరించే విధంగా రహదారిని మరమ్మత్తులు చేసి వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రధాన రహదారి కావడంతో ట్రాఫిక్ అంతరాయం లేకుండా పనులను త్వరితగతిన పూర్తి చేసి, సమస్య పునరావృతం కాకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో శివరాజ్ గౌడ్, షౌకత్ అలీ మున్నా, పోశెట్టిగౌడ్, ఎ.ఇ. శ్రావణి, వర్క్ ఇన్స్పెక్టర్ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కాలనీ అభివృద్ధిలో నా సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయి

### ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్



**చింతల్,నవంబర్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
చింతల్ డివిజన్ భగత్ సింగ్ నగర్ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ సభ్యులు పేట్ బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే గారి క్యాంప్ కార్యాలయంలో బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ మాట్లాడుతూ భగత్ సింగ్ నగర్ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ సభ్యులు కలిసి కట్టుగా ఉంటూ కాలనీలోని సమస్యలను పరిష్కరించుకుంటూ కాలనీ ప్రగతి వైపు కృషి చేయాలని సూచించారు. కాలనీ అభివృద్ధిలో తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రషీదా మహమ్మద్ రఫీ, నూతన అధ్యక్షులు నరేందర్ గౌడ్, కార్యదర్శి ప్రతాప్ రెడ్డి, బిసు వెంకటేష్, రామకృష్ణ, వెంకట్ రెడ్డి, శ్రీధర్, నాగభూషణం, శివ పాటిల్, నర్సింహా, కృష్ణ రెడ్డి, ముప్పిడి నర్సింహా, మల్లేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# మానవహారం కార్యక్రమానికి సహకరించండి

### - గంజాయి వ్యతిరేక కమిటీ పిలుపు



**జగద్గిరి గుట్,నవంబర్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఈ నెల 14న జరగనున్న మానవహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గంజాయి వ్యతిరేక కమిటీ నాయకులు ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం నిర్వహించిన అఖిల పక్షాల, అన్ని బస్తి కమిటీల గంజాయి వ్యతిరేక సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను కమిటీ సభ్యులు నేడు జగద్గిరి గుట్ట పోలీస్ ఇన్స్పెక్టర్ బి. వెంకటేష్‌కు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలీస్ అధికారులు, స్థానిక బస్తి కమిటీల ఆధ్వర్యంలో అన్ని బస్తిలలో గంజాయి వ్యతిరేక సమావేశాలు జరగాలని కోరారు. అదే విధంగా బాలల దినోత్సవం సందర్భంగా అన్ని బస్తి కమిటీల నాయకులు, రాజకీయ పార్టీలు, ప్రజలు, విద్యార్థులు కలిసి మానవహారం నిర్వహించాలని నిర్ణయించామని తెలిపారు. ఆ కార్యక్రమానికి హాజరై ఐక్య సందేశాన్ని అందించాలని పిలుపునిచ్చారు. సీఐ కూడా తమ సిబ్బంది పాల్గొంటారని, అలాగే బస్తి స్థాయిలో సమావేశాలు నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, సహాయ కార్యదర్శులు హరినాథ్, రాములు, కాంగ్రెస్ నాయకులు సాయి పంతులు, బిఆర్ఎస్ నాయకుడు సాజిద్, జనసేన నాయకులు సతీష్, లెనిన్ నగర్ నాయకులు సదానందం, సాయిలు, రాజు, రవీందర్, శ్రీనివాస్ నగర్ ఖాయుమ్, మైసమ్మ నగర్ బ్రహ్మానంద చారీ, కృష్ణ, వెంకటేష్, సోమయ్య నగర్ కుమార స్వామి, శ్రీనివాస్, ప్రజానాట్య మండలి బాబు, ట్రాన్స్పోర్ట్ యూనియన్ అధ్యక్షులు శ్రీనివాస్ చారీ, బీరప్ప నగర్ చారీ, దేవమ్మ బస్తి వంశీ తదితరులు పాల్గొన్నారు.

# నాగులపల్లి లో దారుణం

### చిన్నారి పై వీధి కుక్కల దాడి



**ఫరూక్‌నగర్ , నవంబర్ 12(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
: రంగారెడ్డి జిల్లా ఫరూక్‌నగర్ మండలంలోని నాగులపల్లి గ్రామంలో భయానక ఘటన చోటుచేసుకుంది. ఇంట్లో ఆడుకుంటున్న మూడు సంవత్సరాల బాలుడు రుత్విక్ పై వీధి కుక్కలు దాడి చేశాయి. బాలుడు కేకలు వేయడంతో స్థానికులు పరుగెత్తి వచ్చి కుక్కలను తరిమారు. అయితే ఈ దాడిలో బాలుడు తీవ్రంగా గాయపడి ఎడమ కన్నును కోల్పోయాడు. వెంటనే షాద్‌నగర్ ఆసుపత్రికి తరలించి, అనంతరం హైదరాబాద్ సరోజినీ కంటి ఆసుపత్రికి మార్చారు. ఈ ఘటనతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. గ్రామస్థులు వీధి కుక్కల సమస్యను అధికారులు పట్టించుకోవాలని, తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# పెద్దపల్లి లో జిల్లా స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం




**పెద్దపల్లి, నవంబర్ 12(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
పెద్దపల్లి జిల్లా భారతీయ జనతా యువమోర్చా ఆధ్వర్యంలో, భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకుల జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న జిల్లా స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ ఈ రోజు నుండి ప్రారంభమైంది. ప్రారంభోత్సవ కార్యక్రమానికి పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి మరియు జిల్లా అధ్యక్షులు కర్రె సంజీవి రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలందరూ పాల్గొని టోర్నమెంట్ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం మధ్యాహ్నం 1 గంటకు ప్రభుత్వ కళాశాల మైదానంలో జరిగింది. విజేతలకు ఆకర్షణీయ బహుమతులు ప్రకటించారు ౹ మొదటి బహుమతి రూ.50,000, రెండవ బహుమతి రూ.25,000. ఈ కార్యక్రమాన్ని బెజ్జంకి దిలీప్ కుమార్ సమన్వయం చేశారు.

# నాణ్యమైన ధాన్యం కొనుగోలు త్వరగా పూర్తి చేయాలి

### -జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**సుల్తానాబాద్, నవంబర్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సూచించారు. బుధవారం సుల్తానాబాద్ మండలంలోని చిన్న బొంకూరు గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యం నాణ్యత ప్రమాణాలు రాగానే వెంటనే కొనుగోలు చేయాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని అదే రోజు రైస్ మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, రైతులకు 48 గంటలలోగా చెల్లింపులు జరిగేలా చూడాలని సూచించారు. రైతులకు అవసరమైన వసతులు కొనుగోలు కేంద్రాల వద్ద కల్పించాలని కూడా ఆయన పేర్కొన్నారు. సన్న రకం ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్, రైస్ మిల్లుల వద్ద ఎటువంటి జాప్యం లేకుండా దిగుమతి అయ్యేలా చూడాలని, హమాలీల సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి కే. శ్రీనాథ్‌తో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# అందెశ్రీకి నివాళులు సమర్పించిన వయోధికులు



**గోదావరిఖని, నవంబర్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పోచారం మున్సిపాలిటీ సుప్రభాత్ టౌన్‌షిప్‌లో ఘట్‌కేసర్ మండలానికి చెందిన వయోధికులు, సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ నాయకులు ప్రజాకవి, రచయిత అందెశ్రీ మరణించిన సందర్భంగా ఆయన చిత్రపటానికి పుష్పాంజలి అర్పించి సంతాపం ప్రకటించారు. అనంతరం ఆయన ఆత్మకు శాంతి కలగాలని మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉప ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణుమాధవ్, తెలంగాణ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి తోట రంగయ్య ప్రసంగిస్తూ అందెశ్రీగా పేరు గడించిన అందె ఎల్లయ్య 1961 జూలై 18న సిద్దిపేట జిల్లా రేబర్తి గ్రామంలో జన్మించారని గుర్తుచేశారు. చదువులేకున్నా తన ప్రతిభతో "కొమ్మ చెక్కితే బొమ్మరా", "గల గల గజేల్ల బండి", "పల్లె నీకు వందనాలు", "మాయ పోతున్నాడమ్మ మనిషన్నవాడు" వంటి కవితలతో హృదయాలను కదిలించారని, తెలంగాణను ఉర్రూతలూగించిన "జయ జయహే తెలంగాణ" పాటను రచించిన గొప్ప కవి అని కొనియాడారు. అందెశ్రీ మరణం తెలంగాణకు తీరని లోటని, ఆయన పేరు చిరస్థాయిలో నిలవాలంటే సిద్దిపేట జిల్లాను "అందెశ్రీ సిద్దిపేట"గా నామకరణం చేయాలని, ఆయన అంతిమ యాత్ర జరిగిన ఘట్‌కేసర్ వద్ద వరంగల్ హైవేపై కాంస్య విగ్రహం ప్రతిష్ఠించాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో వి. ఇన్నా రెడ్డి, పి. యాది రెడ్డి, జి. పోచి రెడ్డి, ముత్యాల గౌడ్, జి.వి. రాజి రెడ్డి, కె. బీరయ్య, ఎం. రాజనర్సు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఉచిత నోట్ బుక్స్ పంపిణీ



**తలకొండపల్లి, నవంబర్ 12(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల కేంద్రంలోని ఇంటర్మీడియట్ కళాశాల విద్యార్థులకు రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో ఉచిత నోట్ బుక్స్ పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు గందె సురేష్ మాట్లాడుతూ ఉన్నత స్థాయికి చేరుకోవడానికి ఇంటర్మీడియట్ విద్య మొదటి మెట్టు అని పేర్కొన్నారు. గవర్నమెంట్ కళాశాలలో చదివిన విద్యార్థులు కలెక్టర్లు, ఇంజనీర్లు వంటి ప్రతిష్టాత్మక స్థానాలకు చేరుకున్నారని గుర్తు చేశారు. జిల్లా వ్యాప్తంగా 25,000 నోట్ బుక్స్‌ను గవర్నమెంట్ స్కూళ్లలో పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మాధవరావు, ఫరూక్నగర్ మండల అధ్యక్షులు మరియు బుక్స్ కమిటీ చైర్మన్ ఎల్కుర్తి నారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు మిట్టపల్లి అంజయ్య, జిల్లా యువజన సంఘం కోశాధికారి మరియు సామాజిక కార్యకర్త నీల రవీందర్, మెంబర్షిప్ కమిటీ చైర్మన్ మల్లిపెద్ది శ్రీనివాస్, ఫరూక్నగర్ మండల మాజీ అధ్యక్షులు హన్మారి మురళి, గజవాడ యశ్వంత్ రాజ్, శివ కరుణాకర్, తలకొండపల్లి ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షులు పి. అరవింద్, గ్రామ అధ్యక్షులు కందే మధుసూదన్, సెక్రటరీ బిళ్ళకంటి లక్ష్మణ్, కళాశాల అడ్మినిస్ట్రేషన్ ఇంచార్జ్ షణ్ముఖ రెడ్డి, అధ్యాపకులు కృష్ణకాంత్, రనిషా, శ్రీనివాస్, పద్మ, యాదయ్య, గార్గేయ, సంతోష్, పరమేష్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# చార్టెడ్ అకౌంట్స్‌లో ఉత్తీర్ణత సాధించిన అబ్బుజకు సన్మానం



**షాద్‌నగర్, నవంబర్ 12(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో ప్రముఖ వ్యాపారవేత్త సోమ రాఘవేందర్ కుమార్తె అబ్బుజ చార్టెడ్ అకౌంట్స్‌లో ఉత్తీర్ణత సాధించిన సందర్భంగా రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం జరిగింది. జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు గందె సురేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అబ్బుజను సన్మానించి అభినందనలు తెలిపారు. విద్యార్థులు కృషి, పట్టుదలతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, అబ్బుజ సాధించిన విజయంతో యువతకు ప్రేరణ లభిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ కార్యవర్గ సభ్యులు బెజుగం రమేష్, రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య యువజన సంఘం కోశాధికారి మరియు సామాజిక కార్యకర్త నీల రవీందర్, ఫరూక్‌నగర్ మండల అధ్యక్షులు ఎల్కుర్తి నారాయణ, మాజీ అధ్యక్షులు హన్మారి మురళి, ఎల్కుర్తి జగదీశ్వర్, బండారి శంకర్, జిల్లా మెంబర్షిప్ కమిటీ చైర్మన్ మల్లిపెద్ది శ్రీనివాస్, గజవాడ యశ్వంత్ రాజ్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబిబిఎస్ సీటు సాధించిన మహాలక్ష్మి



**హుస్నాబాద్, నవంబర్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణానికి చెందిన కేడిక ఉమా సురేందర్ రెడ్డి దంపతుల కుమార్తె మహాలక్ష్మి నీట్ 2025లో మెరుగైన ర్యాంకు సాధించి అసిఫాబాద్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబిబిఎస్ సీటు సంపాదించింది. ఈ విజయాన్ని పురస్కరించుకుని హుస్నాబాద్ ధర్మవీర్ యోగ శిక్షణ శిబిరం ఆధ్వర్యంలో మహాలక్ష్మిని శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా యోగా శిక్షకురాలు, మాజీ మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఐలేని అనిత రెడ్డి మాట్లాడుతూ మహాలక్ష్మి పట్టుదలతో, క్రమశిక్షణతో చదివి నీట్‌లో మెరుగైన ర్యాంకు సాధించడం పట్ల తల్లిదండ్రులు, గురువులకు కృతజ్ఞతలు తెలిపారు. మహాలక్ష్మి హుస్నాబాద్‌లోని సివి రామన్ స్కూల్లో పదవ తరగతి వరకు చదివి, ఇంటర్మీడియట్‌ను కరీంనగర్ ఆల్ఫోర్స్‌లో పూర్తి చేసింది. అనంతరం లాంగ్‌టర్మ్ నీట్ శిక్షణ తీసుకొని ర్యాంకు సాధించిందని తల్లిదండ్రులు ఉమా, సురేందర్ రెడ్డి తెలిపారు. ధర్మవీర్ యోగా శిక్షణ మహిళా సభ్యులు మహాలక్ష్మికి శుభాకాంక్షలు తెలియజేశారు.

## ప్రభుత్వ గిరిజన బాలికల కళాశాల వసతి గృహంలో కరెంటు, నీటి ఇబ్బందులు



**హుస్నాబాద్, నవంబర్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రభుత్వ గిరిజన బాలికల కళాశాల వసతి గృహంలో విద్యార్థులు గత వారం రోజులుగా కరెంటు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కరెంటు లేకపోవడంతో నీటి సరఫరా నిలిచిపోయి స్నానం చేయడానికి కూడా ఇబ్బందులు పడుతున్నారని విద్యార్థులు తెలిపారు. అదేవిధంగా మెనూ ప్రకారం ఆహారం అందించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిని బిజెపి మండల అధ్యక్షుడు భూక్యా సంపత్ నాయక్ ఆధ్వర్యంలో వసతి గృహాన్ని సందర్శించారు. హాస్టల్ వార్డెన్ గాయత్రిని వివరణ కోరగా, కరెంటు రిపేర్ బాధ్యత కాంట్రాక్టర్‌దని, బిల్లులు వారికే ఇస్తారని, తాము చేయలేమని తెలిపారు. డిటిడిఓను ఫోన్‌లో సంప్రదించినా స్పందన లభించలేదని నాయకులు పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, కరెంటు, నీటి సరఫరా పునరుద్ధరించాలని వారు అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ అధ్యక్షుడు వెల్దండి రాజేంద్రప్రసాద్, గిరిజన నాయకులు మోహన్ నాయక్, బొల్లి సుధాకర్ పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఆర్థిక స్థితి బలోపేతం ద్వారా గ్రామీణ అభివృద్ధి



**మంచిర్యాల, నవంబర్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
స్థానిక సంస్థల ఆర్థిక స్థితిని బలోపేతం చేయడం ద్వారా గ్రామీణాభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య అన్నారు. ఆదిలాబాద్ కలెక్టరేట్‌లో జరిగిన ఉమ్మడి జిల్లా సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి రూపాయి ప్రజల ప్రయోజనానికి వినియోగించబడాలని, నిధుల వినియోగం పారదర్శకంగా ఉండాలని సూచించారు. పంచాయతీలు, మున్సిపాలిటీలు ప్రజల ప్రాథమిక అవసరాలపై దృష్టి పెట్టి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. వ్యవసాయం, పశుసంవర్ధక, మత్స్య, అటవీ, చిన్నతరహా పరిశ్రమలు, విద్య, ఆరోగ్యం, మహిళా–శిశు సంక్షేమం వంటి రంగాలు గ్రామీణ ఆర్థికాభివృద్ధికి పునాది లాంటివని పేర్కొన్నారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తే స్థిరమైన అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ఈ సమావేశంలో నాలుగు జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ధర్మ పోరాట దీక్షలను విజయవంతం చేయాలని బీసీ జేఏసీ పిలుపు



**హుస్నాబాద్, నవంబర్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హుస్నాబాద్ పట్టణంలోని రాజరాజేశ్వర ఫంక్షన్ హాల్‌లో బీసీ జేఏసీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో స్థానిక సంస్థలు, విద్యా, ఉద్యోగాల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ బంద్‌కు సహకరించిన అన్ని పార్టీల ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. రేపు జరగబోయే ధర్మ పోరాట దీక్షను విజయవంతం చేయాలని నిర్ణయించారు. హుస్నాబాద్ బీసీ జేఏసీ కోఆర్డినేటర్ మేకల వీరన్న యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బోలిశెట్టి శివయ్య, ఆకుల వెంకట్, అన్వర్, ఇల్లందుల లక్ష్మణ్ గౌడ్, మెతుకు కొమురయ్య, వడ్డెపల్లి వెంకటరమణ, కోడం ప్రభాకర్, పెరుమాండ్ల నర్సాగౌడ్, మైదశెట్టి వీరన్న, వల్లపు రాజు, గట్టు రాములు, అలువోజు రవీందర్, మార్క అనిల్ గౌడ్, బైరి శ్రీనివాస్, పున్న సారయ్య, కేశవేణి రమేష్ తదితరులు పాల్గొన్నారు. బీసీలకు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 42% రిజర్వేషన్లు అమలు చేయాలని, ఇందుకోసం రాజ్యాంగ సవరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచాలని బీసీ జేఏసీ నిర్ణయించింది. నేడు ఉదయం 9 గంటలకు హుస్నాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో జరిగే ధర్మ పోరాట దీక్షలో పార్టీలు, బీసీ సంఘాలు, కుల సంఘాలు, విద్యార్థి, యువజన, మహిళా, ఉద్యోగ సంఘాలు పాల్గొని విజయవంతం చేయాలని ప్రత్యేక విజ్ఞప్తి చేశారు.

## అక్రమ ఇసుక రవాణా చేసిన వారిపై బైండోవర్

**కరీంనగర్, నవంబర్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమ ఇసుక రవాణా చేస్తూ పట్టుబడిన గొల్లపల్లి గ్రామానికి చెందిన దర్శనాల మహేష్, కిసాన్ నగర్‌కు చెందిన పండుగ అనిల్, నీరుకుల్లా కుమార్‌లను తాసిల్దార్ ముందు మూడు లక్షల పూచికత్తుతో బైండోవర్ చేశారు. అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని కరీంనగర్ రూరల్ సీఐ ఏ.నిరంజన్ రెడ్డి హెచ్చరించారు.

## జూబ్లీహిల్స్ బైపోల్ ఫలితాలపై కాంగ్రెస్ ధీమా



**కరీంనగర్, నవంబర్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయం సాధించనున్నారని ఎగ్జిట్ పోల్స్ స్పష్టంచేశాయని 30వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొంతి గోపి తెలిపారు. గత 9 ఏళ్లలో ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన బిఆర్ఎస్ పార్టీ నగదు, మద్యం పంచినా ఓటర్లు నమ్మలేదని, ఈ ఎన్నికతో బిఆర్ఎస్ దుకాణం బంద్ అవుతుందని అన్నారు. కాంగ్రెస్ వ్యూహాత్మక ప్రచారం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి ఓటర్లను ఆకట్టుకుందని పేర్కొన్నారు. బిజెపి నేతల విద్వేష ప్రసంగాలు ప్రజల్లో అసహ్యం కలిగించాయని, డిపాజిట్ కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని దొంతి గోపి ఎద్దేవా చేశారు. ఇకపై ఎన్నిక ఏదైనా గెలుపు కాంగ్రెస్ పార్టీదేనని ధీమా వ్యక్తం చేశారు.

## అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ పోస్టర్ విడుదల



**కరీంనగర్, నవంబర్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నవంబర్ 19న జరగబోయే అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని, వారం రోజులపాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వయోవృద్ధుల దినోత్సవ పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా సంక్షేమ అధికారి యం. సరస్వతి, రెవెన్యూ అధికారులు, సిడిపిఓలు, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ సనా జవేరియా, వయోవృద్ధుల సంఘ సభ్యులు పెండ్యాల కేశవరెడ్డి, మోసం అంజయ్య, తొడుపునూరి ఆనందం, లక్ష్మీపతి, రామేశం, సామ నారాయణ, ఖాజా సర్వరొద్దీన్, బండ సత్యయ్య తదితరులు పాల్గొన్నారు.

## క్రీడాకారులకు జిల్లా కలెక్టర్ అభినందన



**కరీంనగర్, నవంబర్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రంగారెడ్డి జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి యోగాసన పోటీల్లో ఓవరాల్ ఛాంపియన్షిప్ సాధించిన కరీంనగర్ జిల్లా క్రీడాకారులను జిల్లా కలెక్టర్ పమేల సత్పతి అభినందించారు. ఈనెల 9న ఎస్ఎంపి అంతర్జాతీయ పాఠశాలలో జరిగిన పోటీల్లో కరీంనగర్ క్రీడాకారులు 83 పాయింట్లతో విజేతలుగా నిలిచారు. ఐదుగురు స్వర్ణ, నలుగురు రజత, నలుగురు కాంస్య పథకాలు సాధించారు. కలెక్టర్ మాట్లాడుతూ యోగా మన భారతీయ సంస్కృతి ప్రతీక అని, జాతీయ స్థాయిలో కూడా పథకాలు సాధించాలని ఆకాంక్షించారు. జిల్లా యోగా అసోసియేషన్ ప్రణాళికాబద్ధమైన శిక్షణతో 16 సార్లు వరుసగా రాష్ట్రస్థాయి విజేతలుగా నిలిచిందని, జాతీయ స్థాయిలో విజయాలు సాధించేలా ప్రత్యేక శిక్షణ ఇస్తామని అధ్యక్షులు నాగిరెడ్డి సిద్ధారెడ్డి, కార్యదర్శి గుంటి రామకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి వి. శ్రీనివాస్, యోగా అసోసియేషన్ ఉపాధ్యక్షులు కన్న కృష్ణ, కోశాధికారి స్వరూప చారి, కోచులు వి. కిష్టయ్య, పి.పి.పి. మల్లేశ్వరి, ఏ. ఆనంద్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## జనసేన పార్టీ నాయకులు శ్రీకారం ప్రకాష్ కు జన్మదిన శుభాకాంక్షలు వెల్లువ

**రైల్వే కోడూరు ,నవంబర్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరు మండల పరిధిలోని రెడ్డివారి పల్లి కి చెందిన జనసేన పార్టీ సీనియర్ నాయకులు శ్రీకారం ప్రకాష్ జన్మదినోత్సవం బుధవారం నాడు పురస్కరించుకున్న సందర్భంగా పార్టీలోని నాయకులు కార్యకర్తలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ సీనియర్ నాయకులు ముద్ద పోలు రామసుబ్బయ్య, ముద్దపోలు సభాపతి, వరికూటి నాగరాజు, కొమ్మ మనోహర్, ముత్యాల కిషోర్, దాసరి వీరేంద్ర, నాగోలు అమర్నాథ్, గార్లపాటి పెంచలయ్య, కొక్కంటి మహేష్, అంకిపల్లి సంజు నాయకులు కార్యకర్తలు శాలువాలతో సన్మానించి పూలమాలతో సత్కరించడం జరిగింది.

## హుస్నాబాద్ ఏసిపి కార్యాలయంలో క్రైమ్ రివ్యూ మీటింగ్



**హుస్నాబాద్, నవంబర్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ఏసిపి కార్యాలయంలో క్రైమ్ రివ్యూ మీటింగ్‌ను ఏసిపి సదానందం నిర్వహించారు. ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న కేసులపై హుస్నాబాద్ సర్కిల్ సిఐ శ్రీనివాస్, హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ ఎస్సైలతో చర్చించారు. దొంగతనాలను అరికట్టడం, శాంతి భద్రతలను పరిరక్షించడం కోసం క్రమశిక్షణతో వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు.

## తెలంగాణ ఉద్యమకారుల హామీలను అమలు చేయాలి



**హుస్నాబాద్, నవంబర్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండల కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర నాయకుడు గడిపే మల్లేశ్ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు రెండు సంవత్సరాలు గడిచినా అమలు చేయకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఉద్యమకారుల త్యాగాలను, వారు చేసిన కృషిని గుర్తించి ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. డిసెంబర్ 9లోపు హామీల అమలు ప్రకటన చేయకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి కరీంనగర్ జిల్లా చైర్మన్ మారస్వామి, శ్రీనివాస్, ఉత్తర తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మహిళా అధ్యక్షురాలు అయిల ప్రసన్న, బండారి కుమార్, జాగీర్ సత్యనారాయణ, ఐలేని సంజీవ రెడ్డి, మహమ్మద్ అంకుశావలి, రమేష్ రెడ్డి, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

## మత్స్యకారుల అభివృద్ధి కోసం చేప పిల్లల పంపిణీ



**మంచిర్యాల, నవంబర్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మత్స్యకార సంఘాలు, మత్స్యకారుల అభివృద్ధి కోసం ప్రభుత్వం చేప పిల్లల ఉచిత పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద తెలిపారు. బుధవారం భీమారం మండలం గొల్లవాగు ప్రాజెక్టులో మత్స్యశాఖ ఆధ్వర్యంలో చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మత్స్యకారుల అభివృద్ధి కోసం ప్రభుత్వం 100 శాతం రాయితీపై రిజర్వాయర్లు, చెరువులు, వాగులు, కుంటలలో చేప పిల్లలను ఉచితంగా విడుదల చేస్తుందని పేర్కొన్నారు. చేపలు తినడం ద్వారా శరీరానికి అవసరమైన ప్రోటీన్లు అందుతాయని, మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. చెన్నూరు ప్రాంతంలో మోడల్ ఫిష్ సెంటర్ ఏర్పాటు చేయడానికి కృషి చేస్తున్నామని, భీమారం మండలంలో మత్స్యకార సొసైటీ కోసం భవనం నిర్మించామని తెలిపారు. ఫిష్ మార్కెట్, విద్యుత్ లైన్స్ ఏర్పాటు, చెరువు పూడికతీత, చెరువులో చెట్ల తొలగింపు అంశాలను మంత్రి దృష్టికి తీసుకురాగా, వాటిని త్వరలోనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## రైతులు దళారుల చేతిలో మోసపోవద్దు

### కొత్త కురుమ సత్తయ్య



**యాచారం, నవంబర్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రైతులు దళారుల చేతిలో మోసపోకుండా ఐకేపీ, సొసైటీలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆశ్రయించాలని పీఏసీఎస్ జిల్లా చైర్మన్ కొత్త కురుమ సత్తయ్య సూచించారు. నందివనపర్తి గ్రామ పంచాయతీ ఆవరణలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన, మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్ రెడ్డి కలిసి ప్రారంభించారు. రైతులకు మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయడమే ఈ కేంద్రం ఉద్దేశమని సత్తయ్య తెలిపారు. మధ్యవర్తులు లేకుండా రైతులు నేరుగా లాభం పొందగలరని ఆయన పేర్కొన్నారు. గురునాథ్ రెడ్డి మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ఎజెండా, మద్దతు ధర ఇవ్వకుండా మోసం చేసే దళారులపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మస్కు నర్సింహా, బీఎన్ఆర్ ట్రస్ట్ చైర్మన్ శేఖర్ రెడ్డి, ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శి, రైతులు పాల్గొన్నారు.

# అందెశ్రీకి ఘన నివాళులు



**గోదావరిఖని, నవంబర్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తెలంగాణ ప్రజాకవి అందెశ్రీ మరణం పట్ల కాంగ్రెస్ పార్టీ 8వ కాలనీ అధ్యక్షుడు గుండేటి రాజేష్ ఆధ్వర్యంలో ఘన నివాళులు అర్పించారు. జిల్లా ఉపాధ్యక్షుడు మారెల్లి రాజిరెడ్డి, పార్టీ శ్రేణులు చిత్రపటానికి పూలమాలలు అర్పించి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ చాగంటి శంకర్, చాట్ల సదానందం, అనుము రాములు, తిరుపతి రెడ్డి, దేవనపల్లి చక్రపాణి, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అందెశ్రీ స్ఫూర్తిని కొనసాగించాలని ప్రతిజ్ఞ చేశారు.

# బొంగునూరి కిషోర్ రెడ్డి జన్మదిన వేడుకలు



**దుండిగల్, నవంబర్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రముఖ సామాజిక సేవకుడు బొంగునూరి కిషోర్ రెడ్డి జన్మదిన వేడుకలు బొంగునూరిలో ఘనంగా జరిగాయి. స్థానిక ప్రజలు, నాయకులు, అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు. పేద విద్యార్థులకు నోట్‌బుక్స్, బట్టలు పంపిణీ, వృక్షారోపణ కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్ పాల్గొని ఆయన సేవా కార్యక్రమాలను ప్రశంసించారు. కిషోర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల ప్రేమే తనకు పెద్ద బహుమతి అని, సేవా కార్యక్రమాలను మరింతగా కొనసాగిస్తానని తెలిపారు. వేడుకలు ఉత్సాహంగా సాగి, చివరగా కేక్ కట్ చేసి, పటాకుల ప్రదర్శనతో ముగిశాయి.

# ఉగ్రవాదానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ ఆందోళన




**గోదావరిఖని, నవంబర్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
దేశంలో పెరుగుతున్న ఉగ్రవాద దాడులపై ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతున్న నేపథ్యంలో, రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు ఎన్‌ఎస్‌యుఐ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి మెంటం ఉదయ్ రాజ్ ఆధ్వర్యంలో గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని దేశ భద్రత పట్ల ప్రభుత్వం మరింత దృష్టి సారించాలని, నిరపరాధుల ప్రాణాలను బలిగొంటున్న ఉగ్రవాదులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్పొరేషన్ అధ్యక్షుడు బొంతల రాజేష్, ఎన్‌ఎస్‌యుఐ నాయకుడు మెంటం ఉదయ్ రాజ్ మాట్లాడుతూ దేశం శాంతి భద్రతల దిశగా వెనుకడుగు వేస్తోందని, కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాదాన్ని అణచివేయడంలో విఫలమైందని విమర్శించారు. ప్రజల ప్రాణాల విలువను గుర్తించి దేశ భద్రతకు ప్రాధాన్యం ఇచ్చేది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని పేర్కొన్నారు. ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మార్గదర్శకత్వంలో ప్రజల భద్రత, సామాజిక ఐక్యత, జాతీయ ఏకతా కోసం కాంగ్రెస్ ఎప్పటికీ ముందుండి పోరాడుతుందని నాయకులు తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో దేశం అభివృద్ధి కన్నా భయం వైపు నడుస్తోందని, ఉగ్రదాడులు అమాయకుల ప్రాణాలను బలిగొడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, యువకార్యకర్తలు "ఉగ్రవాదం నశించాలి శాంతి రాజ్యమేలాలి!", "దేశం మీద దాడి అంటే ప్రజల మీద దాడి!" అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాల్వ లింగస్వామి, దీటి బాలరాజు, తిప్పారపు శ్రీనివాస్, ఎండీ ముస్తఫా, గట్ల రమేష్, చుక్కల శ్రీనివాస్, కొమ్ము వేణు, దొంత శ్రీను, ధూళికట్ట సతీష్, కుంట సది, పంజ శ్రీను, నాయిని ఓదెలు, మొభీన్, ఆరీఫ్, కనుకుంట్ల అశోక్, మహేష్ సిరిపురం, రాపెల్లి కార్తీక్, అడప కృష్ణ, గజబీంకార్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో విద్యా వ్యవస్థ బలోపేతం



**మంచిర్యాల, నవంబర్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రాష్ట్రంలో విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. జైపూర్ మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో రూ.2.5 కోట్ల నిధులతో నిర్మించిన జూనియర్ కళాశాల గదులను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను అభివృద్ధి చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నామని, 51 వేల మంది ఉపాధ్యాయులను నియమించామని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయిలో రాణించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో త్రాగునీరు, విద్యుత్, ప్రహరీ గోడ, వేర్వేరు మూత్రశాలలు వంటి సదుపాయాలు కల్పిస్తున్నామని, ఈ విద్యా సంవత్సరంలో 6-7 వేల మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల నుండి ప్రభుత్వ పాఠశాలలకు చేరారని తెలిపారు. అనంతరం 41 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి/షాది ముబారక్ చెక్కులను మంత్రి అందజేశారు.

# చెన్నూరులో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం



**మంచిర్యాల, నవంబర్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
చెన్నూరు మండల శివలింగాపూర్ గ్రామంలో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని కార్మిక, గనుల శాఖ మంత్రి డా. గడ్డం వివేక్ వెంకటస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతులు మధ్యవర్తుల పాలవ్వకుండా నేరుగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు పత్తి తేవాలని సూచించారు. అధికారులు గ్రేడ్ ఏ పత్తి క్వింటాలుకు రూ.8100 ధరను కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించి ప్రతి రైతుకు న్యాయం జరిగేలా చూడాలని మంత్రి ఆదేశించారు.

# కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి 41వ వర్ధంతి సభ విజయవంతం చేయాలి



**గోదావరిఖని, నవంబర్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
భారత విప్లవోద్యమ నేత, ప్రతిఘటన పోరాట సిద్ధాంతకర్త కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి 41వ వర్ధంతి సభను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఐ.కృష్ణ పిలుపునిచ్చారు. గోదావరిఖని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో సిపిఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో వాల్ పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కామ్రేడ్ పుల్లారెడ్డి జీవితమంతా ప్రజాస్వామిక విప్లవం కోసం కృషి చేశారని, ఆయన సిద్ధాంతాలు, ఆచరణ కార్యకర్తలకు మార్గదర్శకమని పేర్కొన్నారు. ఈ నెల 19న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కేంద్ర కమిటీ స్థాయిలో వర్ధంతి సభ జరుగుతుందని, ప్రజలు, కార్మికులు, ప్రజాస్వామ్యవాదులు, మేధావులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐ.నరేష్, ఐ.రాజేశం, ఎం.దుర్గయ్య, జీ.మల్లేశం, ఎం.కొమరయ్య, పి.మొండయ్య, కే.ఎల్లయ్య, ఎస్.ప్రసాద్, కాంపెల్లి మల్లేశం, రేణిగుంట్ల సదానందం, ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్ల కోసం పోరాటం ఉధృతం

**పెద్దపల్లి, నవంబర్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధన లక్ష్యంగా తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఉద్యమాన్ని ఉధృతం చేస్తోంది. జిల్లా అధ్యక్షుడు కందుల సదాశివ్ ఆధ్వర్యంలో ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో జిల్లా, మండల స్థాయిలకు నూతన కార్యవర్గాన్ని నియమించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చర్లపల్లి సురేష్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై నియామక పత్రాలను అందజేశారు. బీసీల ఐక్యతతోనే హక్కులు సాధ్యమని నాయకులు ఉద్ఘాటించారు. రిజర్వేషన్ల డిమాండ్ సాధనలో భాగంగా నవంబర్ 13న పెద్దపల్లి బస్టాండ్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా, మండల స్థాయి బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

# జాగృతి జనం బాటలో కవితక్కకు ప్రజా ఆదరణ



**కరీంనగర్, నవంబర్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత చేపట్టిన జనం బాట కార్యక్రమానికి ప్రజల నుండి వస్తున్న మద్దతు చూసి కాంగ్రెస్ నేతలు ఓర్వలేకపోతున్నారని జాగృతి జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ అన్నారు. నల్గొండ పట్టణంలో కవిత స్వాగతం కోసం ఏర్పాటు చేసిన హోర్డింగులు, ఫ్లెక్సీలను తొలగించడం ప్రభుత్వ దివాలా కోరుతనానికి నిదర్శనమని ఆయన ఖండించారు. ప్రతి జిల్లాలో ప్రజా సమస్యలను ప్రస్తావిస్తూ, ప్రభుత్వాల తప్పిదాలను ఎండగడుతూ ప్రజల సూచనలు తీసుకుంటూ జాగృతి బలోపేతానికి కవిత ముందుకు సాగుతున్నారని తెలిపారు. ఫ్లెక్సీలు తొలగించినంత మాత్రాన ప్రజల మనసుల్లో కవిత స్థానం చెరగదని హరిప్రసాద్ స్పష్టం చేశారు.

# దేవులవాడలో పల్లె దవాఖానా ప్రారంభం



**మంచిర్యాల, నవంబర్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కోటపల్లి మండలంలోని దేవులవాడ గ్రామంలో రూ.20 లక్షల నిధులతో నిర్మించిన పల్లె దవాఖానా ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాన్ని కార్మిక, గనుల శాఖ మంత్రి డా. గడ్డం వివేక్ వెంకటస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రతి గ్రామంలో ఆరోగ్య సదుపాయాలు అందుబాటులోకి తెస్తుందని తెలిపారు. తరువాత ఆయన మండలంలోని లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు.

# దశదినకర్మలో పాల్గొన్న మంత్రి శ్రీధర్ బాబు

**మంథని, నవంబర్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



మాజీ సర్పంచ్ వోడ్నాల శ్రీనివాస్ తండ్రి కీర్తిశేషులు వోడ్నాల చిన్న మల్లయ్య గారి దశదినకర్మ కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల మరియు శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు పాల్గొన్నారు. మంత్రి చిన్న మల్లయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.

# వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

**- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**

**భూపాలపల్లి, నవంబర్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



రైతులు కష్టపడి పండించిన ప్రతి ధాన్యపు గింజను ప్రజా ప్రభుత్వం పూర్తిగా కొనుగోలు చేస్తుందని, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సూచించారు. శాయంపేట, మొగుళ్లపల్లి మండలాల్లో ఏర్పాటు చేసిన ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలోని కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకువచ్చి గిట్టుబాటు ధర పొందాలని, కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా జరగాలని సంబంధిత అధికారులకు సూచించారు. రైతుల సంక్షేమమే సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మండల పర్యటనలో భాగంగా శాయంపేట రైతు వేదికలో 62 మంది లబ్ధిదారులకు రూ.62.07 లక్షల విలువైన కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. పేద కుటుంబాల ఆడపడుచులకు ఈ పథకం ఆర్థికంగా ఎంతో తోడ్పాటును అందిస్తుందని, మహిళల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే అన్నారు. అదేవిధంగా మండలంలోని 16 మంది లబ్ధిదారులకు రూ.5.70 లక్షల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను, మొగుళ్లపల్లి మండలంలో 20 మంది లబ్ధిదారులకు రూ.5.08 లక్షల విలువైన చెక్కులను అందజేశారు. ఖరీదైన వైద్య చికిత్స చేసుకోలేక ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు సీఎం సహాయ నిధి ఆసరాగా నిలుస్తోందని, అవసరమైన సమయంలో ఈ ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. రైతులకు మొక్కజొన్న సబ్సిడీ విత్తనాలను కూడా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో ప్రజా ప్రతినిధులు, జిల్లా మండల అధికారులు, కాంగ్రెస్ నేతలు, రైతులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆర్థిక మద్దతు పథకాల లక్ష్య సాధనకు బ్యాంకర్ల సహకారం అవసరం




కరీంనగర్, నవంబర్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)

బ్యాంకర్లు ఆర్థిక మద్దతు పథకాల లక్ష్య సాధనకు పూర్తి సహకరించాలని, ఆర్బీఐ నిబంధనలు కచ్చితంగా పాటించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. డీసీసీ, డీఎల్ఆర్సీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ రైతులకు రుణాలు, స్వయం సహాయక సంఘాలకు రుణాలు, మైనారిటీ సంక్షేమ పథకాలలో పారదర్శకతతో మంజూరు చేయాలని ఆదేశించారు. ఏప్రిల్ సెప్టెంబర్ 2025లో రూ.7821.19 కోట్ల రుణాలు మంజూరయ్యాయని, అందులో వ్యవసాయానికి రూ.3239.73 కోట్లు, ఎంఎస్ఎంఈలకు రూ.1761.41 కోట్లు, మహిళా సంఘాలకు రూ.614.36 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో లక్ష్యాల్లో 58.22% సాధించామని, పెండింగ్ రుణాలను త్వరగా మంజూరు చేయాలని బ్యాంకర్లను ఆదేశించారు. అక్టోబర్ డిసెంబర్ మధ్య "మీ డబ్బు మీ హక్కు" ప్రచారం జరుగుతుందని, ప్రజలు క్లెయిమ్ చేయని డిపాజిట్లు, బీమా, మ్యూచువల్ ఫండ్ ఆదాయాలను తిరిగి పొందే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, ఆర్బీఐ, నాబార్డ్, ఎస్బీఐ, టీజీబీ, కెడీసీసీబీ అధికారులు, బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.

## న్యాయవాదుల సమస్యలపై పోరాడుతానన్న పొన్నం అశోక్



కరీంనగర్, నవంబర్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)

బార్ కౌన్సిల్ ఎన్నికల్లో గెలిపిస్తే న్యాయవాదుల సమస్యలపై బార్ కౌన్సిల్‌లో పోరాడుతానని పొన్నం అశోక్ గౌడ్ హామీ ఇచ్చారు. జిల్లా కోర్టులో న్యాయవాదులతో సమావేశమైన ఆయన, జనవరి 2026లో జరిగే ఎన్నికల్లో బార్ కౌన్సిల్ మెంబర్‌గా పోటీ చేస్తున్నానని, న్యాయవాదుల సంపూర్ణ మద్దతు కోరారు. జూనియర్ న్యాయవాదుల స్టైఫండ్, వెల్ఫేర్, రిటైర్మెంట్ బెనిఫిట్, ఇన్సూరెన్స్ సౌకర్యం పెంపు వంటి అంశాలపై కౌన్సిల్‌లో పోరాడతానని తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లింగంపల్లి నాగరాజు శాలువ కప్పి సన్మానం చేశారు. సీనియర్ న్యాయవాదులు అశోక్ గౌడ్ గతంలో కరీంనగర్ బార్ అసోసియేషన్, హైకోర్టు అధ్యక్షుడిగా పనిచేసి మంచి పేరు సంపాదించారని, ఈ ఎన్నికల్లో విజయం సాధిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో లీగల్ సెల్ చైర్మన్ కల్లెపల్లి లక్ష్మయ్య, న్యాయవాదులు, మహిళా న్యాయవాదులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## బాలికల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు ఉచిత సానిటరీ న్యాప్కిన్స్ పంపిణీ




భూపాలపల్లి, నవంబర్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)

బాలికలు ఆరోగ్యకరమైన సమాజంలో పెరిగేందుకు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఉచిత సానిటరీ న్యాప్కిన్స్ పంపిణీ చేయడం అభినందనీయమని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. గణపురం మండలం గాంధీనగర్ మహాత్మా జ్యోతిభాపులే బాలికల పాఠశాలలో గిప్ ఫర్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన స్త్రీ స్వాభిమాన్ మెన్స్ట్రువల్ హైజీన్ అండ్ డిగ్నిటీ ఇనిషియేటివ్ కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. మహిళల ఆరోగ్యం, గౌరవం కోసం ప్రభుత్వం, సేవా సంస్థలు చేపడుతున్న కార్యక్రమాలు ప్రశంసనీయమని వారు పేర్కొన్నారు. రుతుక్రమం సహజ శాస్త్రీయ ప్రక్రియ అని, దాని గురించి సిగ్గు పడాల్సిన అవసరం లేదని విద్యార్థినులకు సూచించారు. పరిశుభ్రత, ఆరోగ్యంపై అవగాహన పెంపొందితే బాలికలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగగలరని అన్నారు. స్కూల్ స్థాయిలోనే హైజీన్ అలవాట్లు పెంపొందేలా ఇలాంటి కార్యక్రమాలు విస్తరించాలని సూచించారు. అనంతరం విద్యార్థినిలకు సానిటరీ హైజీన్ కిట్లను అతిథుల చేతుల మీదుగా అందజేశారు.

## రాష్ట్ర స్థాయి కళా ఉత్సవ్ విజేతలకు కలెక్టర్ అభినందనలు



కరీంనగర్, నవంబర్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)

రాష్ట్ర స్థాయి ఇన్స్ట్రుమెంటల్ మ్యూజిక్ గ్రూప్ పోటీల్లో ప్రథమ బహుమతి సాధించి జాతీయస్థాయికి ఎంపికైన జడ్పీహెచ్ఎస్ వెన్నంపల్లి విద్యార్థులను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అభినందించారు. జాతీయస్థాయిలో కూడా విజయాన్ని సాధించాలని విద్యార్థులకు సూచనలు అందించారు. విజేతలైన విద్యార్థులు అమర గౌండ రోహిత్, అమర గౌండ అశ్వరధ్, వెంగళ ఆశీష్ వర్ధన్, చిగుర్ల రిత్విక్ కుమార్‌లను ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులను తీర్చిదిద్దిన జ్యోతి పి.డి. మేడమ్, ప్రధానోపాధ్యాయుడు రాయిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఉపాధ్యాయ బృందాన్ని కూడా కలెక్టర్ ప్రశంసించారు. అదేవిధంగా కేజీబీవీ తిమ్మాపూర్ విద్యార్థులు జాతీయస్థాయికి ఎంపికైన సందర్భంగా ప్రిన్సిపాల్, విద్యార్థులను కలెక్టర్ అభినందించారు.

## ప్రజల ఆశీర్వాదంతో కాంగ్రెస్ విజయపరంపర



కరీంనగర్, నవంబర్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)

అర్బన్ బ్యాంక్, జూబ్లీహిల్స్ ఎన్నికల్లో విజయం సాధించిన కాంగ్రెస్ పార్టీ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా విజయపరంపర కొనసాగుతుందని సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నామని, సుడా నిధులతో నగర సుందరీకరణ పనులు చేపడుతున్నామని తెలిపారు. రాజీవ్ చౌక్ సుందరీకరణ, రాజీవ్ గాంధీ విగ్రహం, వన్ టౌన్ పోలీస్ స్టేషన్ కూడలి సుందరీకరణ, ప్రధాన రహదారుల్లో వర్టికల్ గార్డెన్లు, అల్గునూర్ బ్రిడ్జిపై గార్డెన్ ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలుపుతూ, మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం సహకారంతో మరింత ఉత్సాహంగా పనిచేస్తామని నరేందర్ రెడ్డి అన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ముత్తారం టీజీ మోడల్ స్కూల్‌లో షీ టీమ్ అవగాహన సదస్సు



పెద్దపల్లి, నవంబర్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)

రామగుండం సి.పి ఆదేశాల మేరకు, షీ టీమ్ ఇంచార్జి ఎస్ఐ లావణ్య ఆధ్వర్యంలో ముత్తారం టీజీ మోడల్ స్కూల్‌లో టీజీ అవగాహన సదస్సు నిర్వహించారు. షీ టీమ్ సభ్యురాలు స్నేహలత మాట్లాడుతూ మహిళల భద్రత, ఆన్లైన్ మోసాలు, యాంటీ డ్రగ్స్, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎవరైనా వేధింపులకు గురైతే 6303923700 నంబర్‌కు ఫోన్ చేసి సమస్య తెలపాలని, వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. ఆన్లైన్ లోన్ యాప్స్, సైబర్ మోసాలకు జోలికి పోకుండా, ఎవరైనా మోసాలకు గురైతే 1930 హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. మహిళలకు ప్రమాదం ఉన్నప్పుడు వెంటనే 100 నంబర్‌కు డయల్ చేయాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్ సభ్యులు మౌనిక, సురేష్, హెడ్‌మాస్టర్ సంతోష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## లయన్ సింహరాజు కోదండరాం జన్మదినోత్సవం సందర్భంగా సేవా కార్యక్రమం



కరీంనగర్, నవంబర్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)

లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ జిల్లా 320 గవర్నరు లయన్ సింహరాజు కోదండరాం జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక టీబీ ఆసుపత్రిలో పేషెంట్లకు ఒక నెల సరిపడా న్యూట్రిషన్ ఆహార కిట్లను పంపిణీ చేశారు. అనంతరం కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో రోగులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కోదండరాం గారు ఇలాంటి జన్మదినాలు ఎన్నో జరుపుకుంటూ మరిన్ని సామాజిక కార్యక్రమాలు చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్, పూర్వ కౌన్సిల్ చైర్మన్ హన్మాండ్ల రాజి రెడ్డి, జిల్లా కేబినెట్ సభ్యులు, మానేరు, శాతవాహన క్లబ్ ప్రతినిధులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ ఆత్మీయ సమ్మేళనం



కరీంనగర్, నవంబర్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)

అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో "తెలంగాణ రాష్ట్రంలో అలయన్స్ ఉద్యమ అభివృద్ధి" అంశంపై ఇంటరాక్టివ్ సెషన్ కరీంనగర్ ఐఎంఏ హాల్‌లో నవంబర్ 9న జరిగింది. కార్యక్రమానికి మాజీ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ అలీ బి. తిరుపతి రాజు, ప్రస్తుత ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఆలీ ఆర్కే సక్సేనా హాజరై ప్రసంగించారు. అలయన్స్ సేవా కార్యక్రమాల విస్తరణ, ఐక్యత, సామాజిక అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని నొక్కి చెప్పారు. డిస్ట్రిక్టులు 137ఏ, 137బి, 258, 271 నుండి ప్రతినిధులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్‌కు సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో డైరెక్టర్ డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్, ఇంజనీర్ కోల అన్నారెడ్డి, చెరిమల వెంకటేశ్వర్లు, గాలిపెల్లి నాగేశ్వర్, పులాల శ్యాం, మోర అంజయ్య, పోలు సత్యనారాయణ, పసుల సతీష్, డి. వేణు కుమార్, సుద్దపల్లి ప్రసాద్, గుజ్జ శ్రీనివాస్, రేణుక, నాజియా, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

## పెద్దపల్లి ఆసుపత్రిలో స్టార్ పెర్ఫార్మర్ అవార్డు




పెద్దపల్లి, నవంబర్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)

జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచనల మేరకు పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బందిలో ప్రతినెల పనితీరు ఆధారంగా ఒకరికి స్టార్ పెర్ఫార్మర్ అవార్డు అందజేస్తున్నారు. నవంబర్ నెలకు గాను స్టాఫ్ నర్స్ మౌనిక ఈ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.శ్రీధర్, ఆర్ఎంఓ, నర్సింగ్ సూపరింటెండెంట్, సిబ్బంది పాల్గొన్నారు.

## నకిలీ విలేకరి అరెస్టు




కోహెడ, నవంబర్ 12(నీలగిరి ఎక్స్ ప్రెస్)

ధర్మసాగర్ పల్లె గ్రామానికి చెందిన పొన్నాల సంజీవ్ (30) నకిలీ విలేకరిగా వ్యవహరించిన ఆరోపణలపై కోహెడ పోలీసులు కేసు నమోదు చేశారు. సిద్దిపేట పట్టణానికి చెందిన గుడాల దుర్గా రాంబాబు గత నాలుగు వారాలుగా కోహెడ ప్రాంతంలోని చిరు వ్యాపారులకు వడ్డీకి డబ్బులు ఇస్తూ వ్యాపారం కొనసాగిస్తున్నాడు. ఈ సమయంలో సంజీవ్ తనను "ప్రెస్ రిపోర్టర్"గా పరిచయం చేసుకుంటూ, రాంబాబును పలుమార్లు ఫోన్, వాట్సాప్ సందేశాల ద్వారా బెదిరించినట్లు సమాచారం. "నాకు డబ్బులు ఇవ్వాలి, లేదంటే నీ గురించి పేపర్లో రాస్తాను" అంటూ ఒత్తిడి తెచ్చినట్లు రాంబాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు మేరకు కోహెడ పోలీసులు సంజీవ్‌ను అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్కు పంపించారు. ఈ సందర్భంగా కోహెడ ఎస్సై పి. అభిలాష్ మాట్లాడుతూ, "ప్రెస్ పేరుతో ఎవరైనా బెదిరింపులు చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవు" అని హెచ్చరించారు.